ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 2 మే 2024

యువత ఏం అడిగారంటే..!

? ఫీజు రీయింబర్స్‌మెంట్లు అమలు చేస్తారా

! పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్లు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పెయిడ్ సీట్ల విధానాన్ని పూర్తిగా రద్దు చేయిస్తా. గతంలో ఏవిధంగా స్కాలర్‌షిప్పులు ఉన్నాయో అవన్నీ అమల్లోకి వస్తాయి.

? కార్మికులకు మీరిచ్చే భరోసా

! గతంలో చంద్రన్న బీమా ద్వారా అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ ప్రమాద బీమా ఉండేది. దీని వల్ల అనేక కుటుంబాలకు ఈ పథకం అండగా నిలిచింది. దానినే మరింత మెరుగ్గా తిరిగి అమల్లోకి తీసుకువస్తాం. కార్మికులను ఎంత వరకు ఆదుకోవాలో అంతా చేస్తా.

? చదువుకున్నోళ్లకు ఉద్యోగాలు ఇప్పిస్తారా

! మా ఆరాటమంతా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే. ముఖ్యంగా నెల్లూరు తయారీ పరిశ్రమలను తీసుకువస్తాం. ఇందుకు నా హామీ. రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నది కూటమి తొలి లక్ష్యంగా పెట్టుకుంది.

? అప్పులు తీర్చాలి. ఉద్యోగులకు జీతాలివ్వాలి. మరి డబ్బులెలా..? అద్భుతం ఏమైనా చేస్తారా

! ఎస్.. మా దగ్గర అద్భుతం ఉంది. దాని పేరే సీబీఎన్. సంపదను సృష్టించిడం చంద్రబాబు బాగా తెలుసు. అప్పులు తీర్చుతూనే మెరుగైన జీతాలిస్తాం. ప్రజలకు సంక్షేమంతోపాటు కనీస అవసరాలన్నీ తీర్చుతాం. అవినీతి, ఆర్థిక దోపిడీని అరికడితే చాలు. రాష్ట్రాన్ని అందంగా తీర్చిదిద్దవచ్చు.

? స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను మళ్లీ ప్రారంభిస్తారా ?

! స్కిల్స్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలని చంద్రబాబు పదే పదే చెబుతుంటారు. అందుకే పెద్ద కంపెనీతో ఒప్పందం చేసుకొని స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశాము. ఐటీ రంగంలో స్కిల్స్ డెవలప్ చేయడం ఒక్కటే కాదు.. ఆల్టర్నేట్ స్కిల్స్ కూడా నేర్పించాము. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో స్కిల్ డెవలప్ మెంట్‌ను ముందుకు తీసుకెళతాము.



నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో యువతనుద్దేశించి ప్రసంగిస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

పారిశ్రామిక హబ్‌గా మారుస్తాం!

- పోర్టు, శ్రీసిటీ అనుసంధానంతో పరిశ్రమల ఏర్పాటు
- మూడేళ్లలో నెల్లూరులో విమానం ఎగురుతుంది
- నగరంలో 43 వేల ఇళ్లు పూర్తి చేస్తాం
- వంద రోజుల్లోపు అన్నా క్యాంటీన్ల ప్రారంభం
- యువతతో ముఖాముఖిలో టీడీపీ నేత నారా లోకేష్
- విజయసాయిరెడ్డితో జాగ్రత్త అంటూ హెచ్చరిక


టీడీపీ అభ్యర్థులతో సెల్ఫీ తీసుకుంటూ..

యువతతో కరచాలనం చేస్తూ..

నెల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి రాగానే నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. పోర్టు, శ్రీసిటీ అనుసంధానంతో ఎక్కువగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు సృష్టిస్తామని వివరించారు. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో యువగళం కార్యక్రమంలో భాగంగా యువతతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. యువతతో నేరుగా మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యువత అడిగిన ప్రశ్నలన్నింటికీ ఆయన సమాధానం చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక విద్యార్థులు, యువత సమస్యలను ఎలా పరిష్కరించబోతున్నామన్నది వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో నెల్లూరు జిల్లాకు సెంబ్ కార్ప్, గమేశా వంటి అనేక పరిశ్రమలను తీసుకొచ్చామని గుర్తు చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమ అయినా వచ్చిందా!? అని ప్రశ్నించారు. రూ.3 వేల కోట్లతో కేంద్ర రక్షణ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తే జగన్మోహన్‌రెడ్డి అహంకారంతో ఆ సంస్థ పక్క రాష్ట్రానికి తరలిపోయిందని అన్నారు. గతంలో ఒప్పందాలు చేసుకొని వెనక్కు వెళ్లిపోయిన కంపెనీలతో మళ్లీ సంప్రదిస్తామని, వాటిలో మెజారిటీ కంపెనీలను నెల్లూరుకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే మొదటి మూడేళ్లలో దగదర్తిలో విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

అత్యాధునిక షీర్ వాల్ టెక్నాలజీతో నెల్లూరులో 43 వేల ఇళ్ల నిర్మాణాలను తమ హయాంలో ప్రారంభించామని లోకేష్ గుర్తు చేశారు. పూర్తయిన ఇళ్లకు వైసీపీ రంగులు వేసుకుంది తప్ప పేదలకు అప్పగించలేదని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే ఆ ఇళ్లన్నీ పూర్తి చేసి పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో నారాయణ సారథ్యంలో రూ.4 వేల కోట్లతో నెల్లూరు నగర రూపురేఖలు మార్చామని చెప్పారు. నెల్లూరులో పెండింగ్ పనులన్నీ తాము పూర్తి చేస్తామని ప్రకటించారు. తనకు పాఠాలు చెప్పిన గురువు నారాయణ మాస్టారు అని గుర్తు చేసుకున్నారు. సొంత నిధులతో ప్రజాసేవ చేస్తున్న గొప్ప వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని ప్రశంసించారు. గెలిపించిన ప్రజలకు సేవ చేయలేకపోతు న్నామని బాధతో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. వీరు ముగ్గురు ట్రిపుల్ ఇంజన్ వంటి వారని, వారిని గెలిపిస్తే నెల్లూరు అభివృద్ధి పరుగులు పెడుతుందని లోకేష్ చెప్పారు. ఈదఫా నెల్లూరు జిల్లాలో పదికి పది సీట్లు గెలిపించాలని, అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని ప్రజలను కోరారు.

ఏ2తో జాగ్రత్త

జగన్మోహన్‌రెడ్డి చేసిన అన్ని కుంభకోణాల్లో ఏ2గా విజయసాయిరెడ్డి ఉన్నారని లోకేష్ విమర్శించారు. వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా వైజాగ్‌ను సర్వనాశనం చేశారని ఆరోపించారు. అలాంటి విజయసాయి ఇప్పుడు నెల్లూరుకు వచ్చారని, ఆయనకు ఓటేస్తే ఇంటి బయట కంప కూడా ఎత్తుకెళ్తారని విమర్శించారు. ఏ2తో జాగ్రత్తగా ఉండాలని, పొరపాటున ఆయనను రానీయ వద్దని ప్రజలకు సూచించారు. ఒకరింట్లో చెత్త మరొకరి ఇంటి ముందు బంగారమవుతుందా అంటూ మాజీ మంత్రి అనీల్ కుమార్‌పై లోకేష్ సెటైర్లు వేశారు. అనీల్‌ను నెల్లూరు ప్రజలు తరిమేస్తే నరసరావుపేటలో తేలారని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం లో ప్రశ్నించి చంద్రబాబు, పవన్, తనతో పాటు కార్యకర్తలు, ప్రజలపై అక్రమ కేసులు పెట్టారని లోకేష్ ఆరోపించారు. అధికారంలోకి రాగానే దొంగ కేసులను ఎత్తివేస్తామని ప్రకటించారు. చట్టాలు ఉల్లంఘించి వ్యవహరించిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని, జ్యుడీషియల్ విచారణ వేస్తామని లోకేష్ హెచ్చరించారు.


లోకేష్‌ను కలిసిన ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి


రోడ్డుపక్కన ధాన్యం రాశులపై పట్టలు కప్పి ఉంచిన రైతులు

ధాన్యం ధర ఢమాల్!

- పుట్టి రూ.15,500 అంటున్న దళారులు
- పని చేయని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

జలదంకి, మే 1 : ధాన్యం ధర పడిపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. నెల్లూరు మసూరి రకం (ఎస్ఎల్ఆర్ 34449) పుట్టి మద్దతు ధర రూ.18,500 ఉండగా దళారులు రూ.15,500లకే అడుగుతున్నారు. వారం రోజుల వరకు పుట్టి రూ.18వేలు ఉండగా ఒక్కసారిగా రూ.3వేలు తగ్గించేశారు. అదేవిధంగా మసూరి రకాలైన కేఎన్ఎం 1638, షుగర్‌లెస్ వారం రోజుల క్రితం పుట్టి రూ.23వేలు ఉండగా ప్రస్తుతం రూ.18వేలకు పడిపోయింది. అదును దాటడంతో దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. దీనికితోడు ధరలు తగ్గు ముఖం పడుతుండటంతో అన్నదాతలు కుమిలిపోతున్నారు. వారంరోజుల వరకు బహిరంగ మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడలేదు. తాజాగా ధరలు పతనమవడంతో రైతులు ఒక్కసారిగా ఆ కేంద్రాల వైపు చూస్తున్నారు. అయితే, ఎక్కడా కేంద్రాల తలుపులు తెరి చి ఉంచిన దాఖలాలు లేవు. ఏ ఒక్క మిల్లరు కూడా బ్యాంకుగ్యారెంటీలు ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలుస్తోంది. జలదంకి మండలంలో కొనుగోలుకేంద్రం మంజూరై ఉన్నా అధికారికంగా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం రైతులు ధాన్యం అమ్మేందుకు వస్తున్నారన్న విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయితే, ఇప్పట్లో కేం ద్రాలు ఏర్పాటు చేసే వీల్లేదని చెబుతున్నారు. లేదా ధాన్యం నిల్వ చేసుకుంటే భవిష్యత్తులో మంచి ధర వస్తుందని అధికారులు చెబుతున్నట్లు అన్నదాతలు అంటున్నారు.

ఉత్తమ పీహెచ్‌సీగా జొన్నవాడ

- ఎన్‌క్యూఏఎస్ సిఫార్సుతో కేంద్ర కమిటీ ర్యాంకు



బుచ్చిరెడ్డిపాళెం, మే1: ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)గా జొన్నవాడ ఎంపికైంది. మూడేళ్ల పాటు ఆసుపత్రిలో వైద్యాధికారులు, సిబ్బంది, రోగులకు అందించిన సేవలు, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను 2022 నుంచి 2024 వరకు నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ ఫర్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం పరిశీలించింది. అనంతరం జొన్నవాడ పీహెచ్‌సీ పనితీరుపై ఎన్‌క్యూఏఎస్ బృందం కేంద్ర కమిటీకి సిఫార్సు చేసింది. దీంతో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేరు సంస్థ నుంచి 87శాతం మెరుగైన సేవలతో జొన్నవాడ ఆసుపత్రిని ఉత్తమ పీహెచ్‌సీగా గుర్తించింది. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తమకు తెలియచేసి అభినందించారని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందిని, క్షేత్రస్థాయి సిబ్బందిని డాక్టర్ అహ్మద్ బాబు అభినందించారు. ఈ గుర్తింపు మూడేళ్లపాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

అద్దె ఇవ్వు.. వైసీపీకీ ఓటెయ్!

- లేకుంటే స్థలం ఇచ్చేదేలే ! • వ్యాపారులను భయపెడుతున్న నాయకులు
- లేకుంటే ఎక్కువ అద్దెకు ఇచ్చేలా ...

'నువ్వు వ్యాపారివే కావొచ్చు. కానీ ఎన్నికల సీజన్ కదా! వైసీపీకి ఓటేస్తే దుకాణానికి అద్దె తగ్గిస్తాం. లేదా ఇదిగో ఎనిమిది వేలు ఇవ్వాల్సిందే! నీవల్ల కాదంటే చెప్పు. పక్కోరోళ్లు రెడీగా ఉన్నారు. వాళ్లకు ఇచ్చేస్తాం.'

- ఇదీ వైసీపీ నాయకుల బెదిరింపులు. ఇక అసలు విషయానికి వస్తే...


వీరేపల్లి జాతీయ రహదారి పక్కన వెలసిన మామిడి పండ్ల దుకాణాలు

ఉలవపాడు, మే 1 : ఉలవపాడు మండల పరిధిలోని చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిపై మామిడి కాయల సీజన్‌లో హైవేకు ఇరువైపులా కొంతమంది షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకో వడం పరిపాటి. అయితే, వీరేపల్లి వద్ద మాత్రం అధికార పార్టీకి చెందిన కొంతమంది స్థలాలను ఆక్రమించుకుంటు న్నారు. ఆ కొత్తగా షాపులు నిర్మించుకునే వాళ్లకు ఏడాది కోసం అద్దె అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. పైగా ఎన్నికల సీజన్ కావడంతో వైసీపీకి ఓటు వేసే వాళ్లకు, సానుభూతిపరులకు మాత్రం తక్కువ లీజుకు షాపులు (పందిరి వేసిన కొట్టాలు), స్థలాలు కేటాయిస్తున్నారు. ఈ వ్యవహారంపై వీరేపల్లికి చెందినకోరేం భాను ప్రతాప్ గత నాలుగు రోజుల క్రితం నేషనల్ హైవే అథారిటీ పీడీకి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. వీరేపల్లికి చెందిన నాయకులు హైవే పక్కన పెన్సింగ్ ఆనుకొని స్థలాలను ఆక్రమించుకొని, అద్దెకు ఇస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. లేదంటూ స్థలాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఈ ఫిర్యాదుపై అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

ఓటింగ్ శాతం పెంచేందుకు
అవగాహన సదస్సులు : కలెక్టర్


హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథ పురం), మే 1: ఓటింగ్‌శాతాన్ని పెంచేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ హరి నారాయణన్ చెప్పారు. బుధవారం నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో ఓటరు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసీ ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడుందో తెలుసుకోడానికి హెల్ప్‌లైన్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. స్మార్ట్‌ఫోన్ లేని వారు సమీపంలోని ఓటరు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు ఎక్కడుందో తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ టీ బాపి రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్

పోలింగ్ కేంద్రాలకు రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను కేంద్ర ఎన్నికల పరిశీలకులు నితిన్ సింగ్ బదారియా పర్యవేక్షణలో కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని ఉదయగిరి, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరురూరల్, కందుకూరు, కావలి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను ఆన్‌లైన్ ప్రక్రియలో ర్యాండమైజేషన్ చేసి కేటాయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ఈవీఎంల నోడల్ అధికారి పద్మాదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

డీఎడ్ సెమిస్టర్ ఫీజులు చెల్లించాలి

నెల్లూరు (విద్య) : డీఎడ్ నాలుగవ సెమిస్టర్ ఫీజులను ఈనెల 8వతేదీ లోపల చెల్లించాలని డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 4 సబ్జెక్టులకు రూ.250, 3 సబ్జెక్టులకు రూ.175, 2 సబ్జెక్టులకు రూ.150, ఒక్క సబ్జెక్టుకు రూ.125 చొప్పున చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 15వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు వేరువేరుగా ఫీజు లు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలని కోరారు.

సోమశిలలో 8.162 టీఎంసీల నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు. బుధవారానికి జలాశయంలో 8.162 టీఎం సీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆత్మకూరు ఉదయగిరి

వాడవాడలా మేడే వేడుకలు


ఆత్మకూరులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు


వరికుంటపాడులో వేడుకలో పాల్గొన్న నాయకులు

ఆత్మకూరు, మే 1 : ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. ఎల్‌ఆర్‌పల్లి, చావిడిసెంటర్, ఆర్టీసీ డిపో ఆవరణం, మున్సిపల్ బస్టాండ్ సెంటర్, పడమటివీధి సెంటర్లలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు డేవిడ్ రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సందాని, గంటా లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య జెండాలను ఆవిష్కరించారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఏఐటీయుసీ, మున్సిపల్ వర్కర్స్ ఆటో యూనియన్ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాలారుద్దీన్, నాగేంద్ర, సిఐటియు, యూటీఎఫ్ నాయకులు జి.శివప్రసాద్ పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక విద్యుత్‌కార్యాలయం సమీపంలోని సీఐటీ యూ కార్యాలయ ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠా యిలు పంచి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మట్టి హరినారాయణ, రమణారెడ్డి పాల్గొన్నారు.

సంగం: మండలకేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం, బస్టాండ్ సెంటర్‌లో కార్మికులు జెండాలను ఎగుర వేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉదయగిరి: బస్టాండ్ సెంటర్, ఆటోగ్యారేజీ, ఆర్టీసీ డిపో, సీపీఎం కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలు జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం ఎంపీటీసీ కాకు విజయమ్మ, కాకు వెంకటయ్య, షేక్ ఫరుద్దీన్‌బాషా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో చలివేంద్రం


పాల్గొన్న కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఆర్టీసీ డీఎం కరిమున్నీసా

ఆత్మకూరు, మే 1: మున్సిపల్ బస్టాండ్ సముదాయంలో కంచి పరమేశ్వరరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన నీరు, మజ్జిగ చలి వేంద్రంను బుధవారం మున్సిపల్ కమీషనర్ షేక్ ఫజులుల్లా, ఆర్టీసీ డీఎం కరిమున్నీసా ప్రారంభించారు. పలు సేవా కార్యక్రమాలు చేప డుతు న్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత అభినందనీయుడని చెప్పారు. అనంతరం ప్రభుత్వ జిల్లా వైద్యశాల ప్రాంగణంలో కంచి పరమేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలింతలకు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, అన్నదానం చేశారు.

లోకేష్‌ను కలిసిన మేకపాటి


లోకేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతకుమారి

ఉదయగిరి రూరల్, మే 1: నెల్లూరు వీఆర్‌సీ మైదానంలో నిర్వహించే యువగళం సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబును బుధవారం మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మేకపాటి శాంతకుమారిలు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ లోకేషబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్‌ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

● అభ్యర్థుల ప్రతినిధులతో సమీక్ష

ఉదయగిరి రూరల్, మే 1: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఉదయగిరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను బుధవారం జనరల్, పోలీస్ అబ్జర్వర్లు రామ్‌కుమార్ గౌతమ్, అశోక్‌దూబేలు అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత స్థానిక ఆర్వో కార్యాలయంలో జనరల్ అబ్జర్వర్ రామ్ కుమార్‌గౌతమ్ పోటీలో నిలిచిన అభ్యర్థుల ప్రతినిధులతో సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. స్థానిక ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పోలీసు అబ్జర్వర్ అశోక్‌దూబే పరిశీలించి సిబ్బందికి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు, సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, పాల్గొన్నారు.

టీడీపీ గెలిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

● సంగం ఎన్నికల ప్రచారంలో ఆనం రామనారాయణరెడ్డి


అనంతసాగరం: ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన సోమశిల వైసీపీ నాయకులు

సంగం, మే 1: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రంలో టీడీపీ విజయం సాధించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జండాదిబ్బ, అరవపాళెం, అన్నారెడ్డిపాళెం, పల్లిపాళెం, మక్తాపురం, అనసూయనగర్, వెంగారెడ్డిపాళెం, సిద్దీపురం, పడమటిపాళెం గ్రామాల్లో ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ప్రతిగ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఆనంకు ఘనస్వాగతం పలికారు. గడిచిన ఐదేళ్లుగా ఉద్యోగాలు లేక చదువుకున్న నిరుద్యోగ యువతీయువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు ఇసుక, గ్రావెల్, మద్యంతో జేబులు నింపుకుని ప్రజలను గాలికి వదిలేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20లక్షల ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో ఉద్యోగ అవకాశలు కల్పిస్తామ న్నారు. పింఛన్ రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇంట్లో బడికి వెళ్లే పిల్లలుంటే ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందరికీ అందజేస్తామన్నారు. మహిళలకు నెలకు రూ.1500ల చొప్పున ఏడాది రూ.18వేలు, రైతులకు ఏడాది రూ.20వేలు, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు, ఇవికాకుండా పక్కాగృహాలు, ఇళ్ల స్థలాలు, పెళ్లి కానుకలు, పట్టణాల్లో అన్నా క్యాంటిన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎన్నికల తరువాత ఏ1, ఏ2లు తీహార్ జైలుకు, రహదారులు నిర్మించకుండానే రూ.150కోట్ల అక్రమంగా టోల్‌గేట్‌లు వసూలు చేసిన స్థానిక శాసనసభ్యుడు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, ఆత్మకూరు జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు. జండాదిబ్బ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆనం సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు, కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు.


ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆనం రంగమయూరరెడ్డి, నాయకులు

● కూటమి అభ్యర్థులను గెలుపించుకుందాం

ఆత్మకూరు: ఈ ఎన్నికల్లో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమని, కూటమి టీడీపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని ఆత్మకూరు ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుందామని ఆనం రంగమయూరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జ్యోతిన గర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు. విభజన రాష్ట్రంలో రూ.16వేల కోట్లు అప్పులో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోట్లాది రూపాయల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులునాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మాదాల మస్తాన్‌నాయుడు, చెరుకూరు వెంకటేశ్వర్లునాయుడు, చెరుకూరు తిరుపతినాయుడు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపిం చాలని నాయకులు బుధవారం ఏఎస్ పేట దర్గా సెంటర్‌లో ప్రచారం నిర్వహించారు. దర్గా సెంటర్‌లోని ప్రతిదుకాణం తిరిగి పార్టీ పథకాల గురించి వివరించారు. అభివృద్ధి కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ కాలేషా, ఖజామియ్య, షేక్ ఖదర్‌బాషా గోవిందయ్య, కలాం పాల్గొన్నారు.

అనంతసాగరం: సోమశిలకు చెందిన వైసీపీ నేతలు ఆనం సమక్షంలో టీడీపీలో చేరారు. ఎంపీటీసీ సభ్యురాలు చలంశెట్టి సునీత, వార్డు మెంబర్ ఎల్లంపల్లి సీనమ్మ, జలకం శీనయ్య, మధు, పెంచలయ్య, అంకయ్య, సంజీవయ్య పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, మాజీ ఎంపీటీసీ వేగు పెంచలయ్య, పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి, పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టో అద్భుతం

● జలదంకి మండల ఎన్నికల ప్రచారంలో ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్


కొత్తపాలెంలో విజయసంకేతం చూపుతున్న ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్

జలదంకి, మే1: కూటమి ఉమ్మడి మేనిఫెస్టోతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంతోషాలు వెల్లువిరుస్తున్నాయని ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం కొత్తపాలెం, సోమవరప్పాడు, వేములపాడు, క్రిష్ణాపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో అక్కడి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్తపాలెం, సోమవరప్పాడులో తమ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కాక వ్యవసాయరుణాలు, పంటబీమా, సాగుకు సంబంధించి పలురకాల రాయితీలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాకర్ల దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలు విన్న కాకర్ల చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రచారరథంపై నుంచి మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కింద సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. వైసీపీ హయాంలో దోచుకోవడం.. దాచుకోవడమే తప్ప ప్రజలకు మేలు చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన ఉదయగిరిలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి యువతకు ఉద్యోగకల్పన, ఉపాధి కల్పిస్తాన న్నారు. అనంతరం వేములపాడులో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మధురెడ్డి, చే వూరి జనార్దన్‌రెడ్డి, పచ్చా మనీషాచౌదరి, చల్లా హనుమారెడ్డి, కంచర్ల శరత్, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, బాబుల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి,, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మండలంలోని జాతీయరహదారి సమీపంలో నాగిరెడ్డిపాలెంకు చెందిన యువకులు పిచ్చపాటి పవన్‌కళ్యాణ్, జిర్రా మల్యాద్రిలు ఏర్పాటు చేసిన చలివేంద్రంను బుధవారం కాకర్ల సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో పి.మధురెడ్డి, పి.భాస్కర్ రెడ్డి, టి.మధుసూదనరావు ఉన్నారు.

ఉదయగిరి రూరల్: మండలంలో గురువారం నుంచి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కకన్వీనర్ చింతనబోయిన బయ్యన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు దాసరిపల్లి, వడ్లమూడిపల్లి, అప్పసముద్రం, తిరుమలాపురం సున్నంవారిచింతల, గుడినరవ, దుంపవారిపల్లి, ఎస్టీ కాలనీ, వెంగళరావునగర్, గండిపాళెంలో పర్యటిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయగిరిలో ప్రచారం నిర్వహిస్తారన్నారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్‌లు పాల్గొంటారన్నారు.

వరికుంటపాడు: గొల్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన 15మంది వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఆవుల మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరుకుని కాకర్ల సురేష్ చేత కండువాలు వేయించుకున్నారు. కార్యక్రమంలో చంద్ర వెంకయ్య, కాకి ప్రసాద్, ఓబులాపురం దేవప్రసన్నకుమార్, లోకసాని రవికుమార్ పాల్గొన్నారు.

వింజమూరు: ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్‌రావు మాదిగ ఆధ్వర్యంలో బుధవారం తక్కెళ్లపాడులోఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్‌కు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పండిటి అంబేద్కర్ మాదిగ మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ నేతలు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటే మన భవిష్యత్తు మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి మాదిగ, మల్లెల తిరుమలేశు మాదిగ, స్థానిక టీడీపీ నాయకులు అంకి పెద్దయ్యమాదిగ, ఎంఎస్పీ మండల కన్వీనర్ బర్రె అర్జున్ మాదిగ, అమ్మనబ్రోలు నాగేష్‌మాదిగ, గంగపట్ల జార్జ్ మాదిగ, అంకి వెంకటేష్‌మాదిగ పాల్గొన్నారు. అనంతరం శంఖవరంలో ఎస్సీకాలనీలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గంగపట్ల వెంగయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేసి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగపట్ల వెంగయ్య, ఐటీడీపీ మండల అధ్యక్షుడు ఆరికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.


వరికుంటపాడు: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాకర్ల సురేష్


వింజమూరు: ఇంటింటి ప్రచారంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

రూ.లక్ష స్వాధీనం

సంగం, మే 1: స్థానిక పోలీస్ చెక్‌పోస్టు తనిఖీలో భాగంగా అధికారులు బుధవారం ఓ ఆటోను తనిఖీ చేశారు. ఈ ఆటోలో వెళుతున్న ఓ గొర్రెల వ్యాపారి రూ.లక్ష జేబులో పెట్టుకుని వెళ్తున్నాడు. తనిఖీ అధికారులు ఆటో నిలిపి తనిఖీ చేయగా నగదు బయపడింది. అందుకు సంబంధించిన ధృవపత్రాలు బాధితుడు చూపించకపోవడంతో నగదును సీజ్ చేశామని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ఉదయగిరిలో బైక్ ర్యాలీ

ఉదయగిరి రూరల్: పట్టణంలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల నుంచి ట్యాంక్‌బండ్ వరకు వైసీపీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి యువతతో కలిసి బుధవారం రాత్రి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, నాయకులు యస్దాన్, తిరుపతి, ముర్తుజా, ఎంఏ సలీం, ఉప్పుటూరి హరి పాల్గొన్నారు.

జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి

● ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి



నెల్లూరు (విద్య), మే 1 : జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ అన్ని చర్యలు చేపడుతోందని విద్యాశాఖ ఆర్‌జేడీ టీ లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్స్(సీఆర్‌ఎంటీ)తో ఆయన సమీక్ష జరిపారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు. పాఠశాల కాంప్లెక్స్‌ల పరిధిలో సీఆర్‌ఎంటీలు ఎంతో కీలకంగా వ్యవహరించాలని, పాఠశాలల్లో ఏ జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అవసరమైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించా రు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయడం, విద్యాకానుకల పంపిణీ, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, నాడు-నేడు పనులను పర్యవేక్షించడం, పాఠశాలల్లో ఇంటరాక్ట్ ప్యానెల్స్ ఏర్పాటులో సహకరించడం వంటి సేవలందించాలన్నారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, వారిని తిరిగి పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యా శాఖ అధికారులకు ఆదేశాలందించామన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి, కావలి డిప్యూటీ ఈవో రఘురామయ్య, ఎస్ఎస్ఏ ఏఎంవో సుధీర్‌బాబు, ఎంఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కోసమే పనిచేస్తా!

● ఇందిరాక్రాంతి పథం ఏపీఎం వ్యాఖ్యలపై దుమారం

● చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్

కోవూరు, మే 1 : వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని, అధికారిక బాధ్యతలకన్నా ఎన్నికల ప్రచారమే తనకు ముఖ్యమని ఇందిరా క్రాంతి పథం ఏపీఎం వెంకటస్వామి సెల్‌ఫోన్‌లో చేసిన వ్యాఖ్యలు ఇవి. ఇటీవల వెలుగు కార్యకర్తలతో ఏపీఎం ఫోన్ చేసి మాట్లాడారు. ఫోన్‌లో జరిగిన సంభాషణ ఆడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈవ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ కోవూరు మండల అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్నను గెలిపించడమే తన లక్ష్యమని ఏపీఎం వెలుగు సిబ్బందిని కోరడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు. ఈ విషయమై తాము రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు పట్టించుకోకపోతే రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ ఏపీఎంకు ఎంపీడీఓ వీరాంజనేయులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

పారిశ్రామికవేత్త జేఎస్‌రెడ్డి కన్నుమూత



నెల్లూరు (సాంస్కృతికం) మే1: పారిశ్రామిక వేత్త, కళాపోషకుడు జక్కా శ్రీనివాసులురెడ్డి (జేఎస్ రెడ్డి) బుధవారం ఉదయం బెంగళూరులో కన్ను మూశారు. ఆయన మృతిపట్ల పలువురు జిల్లా వాసు లు దిగ్భ్రాంతికి గుర య్యారు. ఆయన అంత్యక్రియలు గురువారం ఉదయం 9గంటలకు బెంగళూరులో జరు గుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణం పట్ల మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ప్రపంచ తెలుగు మహాసభ రీజియన్ చైర్మన్ ఎస్.బలరామయ్యనాయుడు, తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం). మే 1: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు సంతపేట గోపి టీ స్టాల్ సెంటర్‌లో షేక్ మల్లిక అనే మహిళ తన ఇద్దరు కుమారులు రఫీ, సర్దార్(22)లతో కలిసి నివాసం ఉంటున్నది. రఫీ బంగారు పని చేస్తుండగా, సర్దార్ చిన్నబజారులోని ఓ మెటల్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. గత నెల 30న సాయంత్రం మల్లిక కోట మిట్టలోని షాదీమంజిల్ వద్దకు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సర్దార్ ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు మృతుడి తల్లి, అన్నకు సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకుని సర్దార్‌ను కిందకు దించి బృందావనంలోని ఓ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి మల్లిక సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత ఆనకట్ట తొలగింపు పనుల పరిశీలన


ఆనకట్ట మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంగం, మే 1: పెన్నానది వద్ద ఉన్న పాత ఆనకట్ట తొలగింపు పనులను బుధవారం తెలుగుగంగ ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకటరమణయ్యలు పరిశీలించారు. సంగం ఆనకట్ట శిథిలావస్థకు చేరడంతో నూతనం బ్యారేజీ నిర్మించి ఏడాది కిందటే ప్రారంభించిన విషయం విదితమే. పాత ఆనకట్టకు 450 మీటర్ల దిగువన కొత్త బ్యారేజీని నిర్మించారు. ప్రస్తుతం నూతన బ్యారేజీ ఆధారంగా నీటిని నిల్వ చేస్తే పాత ఆనకట్టతో నీళ్లు వెనుకకు మళ్లీ బీరాపేరు పొలాలు ముంపునకు గురవుతున్నాయి. అంతేకాకుండా నీటి నిల్వ లెక్క కట్టేందుకు తేడా వస్తుంది. దీంతో పాత ఆనకట్ట క్రస్ట్ లెవల్ వరకు తొలగించాలని స్థానిక ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఆ మేరకు తెలుగుగంగ అధికారులు, ఇరిగేషన్ క్వాలిటీ అధికారులు దీన్ని పరిశీలించారు.. ఆనకట్ట వారధిని కదిలించకుండా క్రస్ట్ లెవల్ వరకు తొలగించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. కార్యక్రమంలో తెలుగుగంగ అధికారులు, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

దోపిడీయత్నం కేసులో ఏడేళ్ల జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), మే 1 : నిద్రపోతున్న ఓ మహిళపై రోకలితో దాడిచేసి దోపిడీ యత్నానికి ప్రయత్నించాడన్న కేసులో నేరం రుజువు కావడంతో షేక్ అబ్దుల్లా అనే నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ నెల్లూరు ఒకటవ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్ శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, నెల్లూరు నగర పరిధిలోని కొత్తూరు లాయర్స్ కాలనీలో 2016 మార్చి 26వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో మొద్దిలేటి అక్కగారి సుజాత తన ఇంటికి సమీపంలోని బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా శబ్దం వచ్చింది. శబ్దం ఎందుకు వచ్చిందని చూడగా నిందితుడు అబ్దుల్లా మచ్చుకత్తితో దాడికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో అతను పారిపోయాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా కుమార్తె శశికళ(20) రక్తపు మడుగులో పడి ఉంది. పక్కనే ఉన్న రోకలి బండకు రక్తం అయిఉంది. దాంతో ఆమె నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని పట్టుకుని అతడిపై దోపిడీ యత్నానికి ప్రయత్నించినట్లు కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇసనాక నీరజ వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	278
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6752
వెండి కిలో ధర	రూ. 81,800
వెండి ఒక గ్రాము	రూ. 83.80

బోగోలులో కాంగ్రెస్ ప్రచారం

బిట్రగుంట, మే 1: బోగోలు మండలంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లేల్లపల్లి సురేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం ఆపార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు, కావలి అసెంబ్లీ అభ్యర్థి పొదలకూరి కల్యాణ్‌లు ప్రచారం నిర్వహించారు. తిప్ప జాతీయ రహదారి వద్ద నుంచి బోగోలు వరకు ర్యాలీ నిర్వహించారు. బోగోలు కూడల్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కంచి వెంకటేశ్వర్లు, కావలి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు జీ.మానస, నాయకులు శ్రీకర్, బాబు, హమీద్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

కావలి, మే 1: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ప్రముఖ వైద్యుడు, రెడ్‌క్రాస్ కన్వీనర్ బెజవాడ రవికుమార్ ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, గాదిరాజు మురళీక్రిష్ణ, సీ. వేణుగోపాల్‌రావు, బీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు!

● సాయికుమార్‌పై సుకుమార్‌రెడ్డి వర్గం దాడికి యత్నం

● ఇంటికొచ్చి భయభ్రాంతులకు గురిచేసి..

అల్లూరు, మే 1 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీలో వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. సోమవారం అర్ధరాత్రి అల్లూరుకు చెందిన వైసీపీ నాయకుడు నీలం సాయికుమార్‌పై కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి వర్గం దాడికి యత్నించింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. వివరాల మేరకు.. సాయికుమార్ నార్తుఆములూరులో తమ పార్టీ కార్యకర్తలతో మాట్లాడుకుని తిరిగి అల్లూరుకు వస్తుండగా ఇందుపూరు కాలువ సమీపంలోని డీఎస్ఆర్ ట్రస్ట్ వద్దకు చేరుకునేసరికి సుకుమార్ రెడ్డి వర్గానికి చెందిన కొందరు యువకులు ఆయన వాహనానికి ద్విచక్ర వాహనాలు అడ్డుపెట్టి ఆపారు. కారు ఆపిన సాయికుమార్‌కు ఫోన్లో సుకుమార్‌రెడ్డి లైన్లో ఉన్నాడని ఓ వ్యక్తి ఫోన్ ఇవ్వగా సాయి మాట్లాడాడు. సుకుమార్‌రెడ్డి అడిగే ప్రశ్నలు దౌర్జన్యంగా ఉన్నాయని భావించిన సాయికుమార్ ఫోన్ తిరిగి ఇచ్చేశాడు. దీంతో ఆగ్రహించిన సుకుమార్‌రెడ్డి వర్గం యువకులు దుర్భాషలకు దిగారు. కారుపై చేతులతో పిడుగుద్దులు గుద్దగా వారి నుంచి తప్పించుకునేందుకు కారు డ్రైవింగ్ సీటులో ఉన్న సాయికుమార్ కుమారుడు ప్రసన్నసాయి కారును వేగంగా పోనిచ్చి ఇంటికి వెళ్లారు. ద్విచక్ర వాహనాలపై కారుని వెంబడించిన యువకులు అతని ఇంటి వద్దకు చేరుకున్నారు. తీవ్రంగా దుర్భాషలాడుతూ దాడికి యత్నించగా అప్పటికే తండ్రీ కొడుకులు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. దీంతో తలుపులను కాళ్లతో తన్ని భయభ్రాంతులకు గురిచేశారు. అక్కడ గొడవ జరుగుతుందని తెలుసుకున్న అదే పార్టీకి చెందిన ఓ నాయకుడు అక్కడకు చేరుకొని వారిని వారించి సుకుమార్‌రెడ్డి వర్గాన్ని అక్కడ నుండి పంపించాడు. తెల్లారేసరికి ఈ ఘటన అల్లూరులో గుప్పుమంది. ఈ విషయాన్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా అల్లూరులోని విష్ణు నివాసంలో బుధవారం మన్నెమాల సుకుమార్ రెడ్డిని, దండా కృష్ణారెడ్డి, సాయికుమార్ వర్గంతో చర్చలు జరిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేస్తామని విష్ణు హామీ ఇచ్చినప్పటికీ సాయికుమార్ వర్గంలో అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి.

బీజేపీ నేతల ప్రచారం

లింగసముద్రం మే 1 : లింగసముద్రం ఎస్టీ కాలనీలో బుధవారం కందుకూరు బీజేపీ ఇన్‌చార్జి ఘట్టమనేని హరిబాబు, మండల అధ్యక్షుడు మట్లి ఏడుకొండలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావులను గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు ఈర్ల మోహన్‌రావు, నాగినేని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ పోటీలు

బిట్రగుంట, మే 1: బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రెండు రోజుల పాటు రైల్వే కార్మికుల మధ్య జరిగిన ఎంఎస్ ప్రసాద్ మెమోరియల్ షటిల్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యాలయంలో విజేతలకు కామ్రేడ్ ధైవాదీనం, వెంకటేశన్, గోవిందరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పీ.జీవన్‌కుమార్, శ్రీనివాసులు, రాజేష్, రాము, వెంకయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే రజకుల సాధికారత

కావలిటౌన్, మే 1: టీడీపీతోనే రజకుల సాధికారత సాధ్యమని ఆ పార్టీ రజక సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ కోవూరు మధు పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక రజకులతో సమావేశమయ్యారు. అనంతరం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీసీలందరూ చైతన్యవంతులై బీసీలకు గుర్తింపు నిచ్చే టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నియోజవర్గ రజక సాధికార కమిటీ నాయకులు ఫైడాల శ్రీనివాసులు, ఫైడాల అరుణ, బిట్రగుంట వెంకటరమణయ్య పాల్గొన్నారు.

సింగపేటలో ప్రచారం

అల్లూరు, మే 1 : మండలంలోని సింగపేట పంచాయతీలోని కొత్తసింగపేటలో స్థానిక నేత బండి అమర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సేవా తత్పరులైన కావ్య, వేమిరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరగల రమణయ్య, చాగంటి రామకృష్ణారెడ్డి, గంటా కుమార్, విడవలూరు భాస్కర్, శోభన్, శీలం బాబు, తుమ్మలపెంట రమణయ్య, మల్లూరు సురేష్ పాల్గొన్నారు. అలాగే అల్లూరు పట్టణ పరిధిలోని ఉద్దీపగుంటలో తెలుగు తమ్ముళ్లు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. బండి శ్రీనివాసులు రెడ్డి, తిరువీధి అనూరాధ, కొల్లుకుదురు జగదీష్‌రెడ్డి, కుప్పూరు శ్రీనివాసులు నాయుడు, మేడా శ్రావణ్‌రెడ్డి, పాశం శ్రీనివాసులు పాల్గొన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని 1, 2 వార్డుల్లో లీగల్ సెల్ నాయకుడు రఫీమాలిక్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఊటు శ్రీకాంత్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, అర్షిత్‌రెడ్డి, బట్టా జయప్రకాష్, పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి టీడీపీకే సాధ్యం

దగదర్తి(బిట్రగుంట), మే 1: పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం ఉలవపాళ్ల ఎస్టీకాలనీలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటే నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. బాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

తెల్లగుంటలో టీడీపీ ఎన్నికల ప్రచారం

బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో టీడీపీ ఎన్నికల ప్రచారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక నేతలు సనిగంటి వేణు, ఏటుకూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఐదు కుటుంబాలు టీడీపీలో చేరారు. మండల పరిశీలకులు దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేవూరి రాజా, రాచగిరి వేణు, ఆర్.రాజా, పట్టెం రామచంద్ర, చేవూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి వేషధారణలో ప్రచారం

కావలిటౌన్, మే 1: టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం టీడీపీ, జిల్లా రైతు సంఘం నాయకుడు రామిరెడ్డి కృష్ణారెడ్డి బ్రహ్మంగారి వేషధారణలో వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం పట్టణ జొన్నాయగుంట ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ బ్రహ్మంగారి కాలజ్ఞానంలో కావలి కనకపట్నంగా మారుతుందని, అది చంద్రబాబునాయుడు, టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల వల్లే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తిరువీధి ప్రసాద్, వంశీగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారి వేషధారణలో కృష్ణారెడ్డి

విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య పోరాటం

● ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు : ఆత్మీయ సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు



గుడ్లూరు : టీడీపీలో చేరిన మిట్టపాలెం వడ్డెరపాలెం వాసులు

కందుకూరు, మే 1: ఈ ఎన్నికలు రాష్ట్రంలో విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న యుద్ధమని, ఏవైపు నిలవాలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల పిఠాపురం వెళ్లి నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన పట్టణంలోని వైసీపీ ముఖ్య నేతల్లో ఒకరైన దారం మాల్యాద్రి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పడమర బలిజపాలెంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. బలిజపాలెం వాసులు పెద్దసంఖ్యలో జనసేనలో చేరి కూటమికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, మద్యం మత్తులో యువత జీవితాలు నాశనం అవుతున్నాయని ఈ పరిస్థితికి జగన్మోహనరెడ్డి దుర్మార్గపు పాలనే కారణమన్నారు. మూడుపార్టీల కలయిక రాష్ట్రంలో ప్రభంజనాన్ని సృష్టించబో తున్నదని, పవన్‌కళ్యాణ్ రాకతో యువతలో ఉత్సాహం వచ్చిందన్నారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దివి శివరాం, ఒంగోలు మున్సిపల్ మాజీచైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, దారం కృష్ణ, వెంకటరమణయ్య, మధు, గోకరాజు శ్రీను, హరికృష్ణ, నరసింహం, ఏకాంబరం చినమస్తాన్, మేడా మధు, నరసింహారావు, పంది మాలకొండయ్య, ఏకాంబరం శ్రీను, శెట్టికొండయ్య, కామాక్షినాయుడు, టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, పాలంకి ప్రసాదు, అల్లం వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, డేగా దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో ప్రచారం చేస్తున్న సౌజన్య

గనిగుంటలో టీడీపీలో చేరిక

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గనిగుంటకు చెందిన పలు కుటుంబాల వారు బుధవారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరి మోహనరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దామచర్ల శ్రీనివాసులు, కొండమూరి ప్రభాకర్, దేవరకొండ అంజయ్య, దామచర్ల వెంకటేశ్వర్లు, గొర్రెపాటి సుబ్బారావు, కొండమూరి సురేష్ కుటుంబాల వారు మోటారు సైకిళ్లపై ర్యాలీగా గుడ్లూరుకు వెళ్లి అక్కడ ప్రచారంలో ఉన్న టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాగేశ్వరరావు వారందరికీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పొడపాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్ మొహిద్దీన్‌నగర్‌లో ఇంటూరి సౌజన్య ప్రచారం

పట్టణంలోని సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా కోటేశ్వర థియేటర్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ కల్లూరి కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ రఫీ, మల్లెల రమణయ్య, మద్దెల సాయి పాల్గొన్నారు.

గుడ్లూరు : గుడ్లూరు మిట్టపాలెం వడ్డెరపాలెం ప్రాంతానికి చెందిన పలువురు కాలనీవాసులు బుధవారం అధికార వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మిట్టపాలెంలో ఏర్పాటు చేసిన సభలో ఇంటూరి మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీలో చేరికలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా దారకానిపాడు ఎస్సీ కాలనీవాసులు కూడా పార్టీలో చేరారన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు వెన్నంట ఉండి, తెలుగుదేశంపార్టీ అన్నివిధాలుగా సహాయపడుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని గద్దెదించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని ఇంటూరి దిశా, నిర్దేశం చేశారు. అనంతరం నూతనంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో తమకు వరిగిందేమిలేదని, బీసీ వర్గాలను అడ్డుపెట్టుకొని ఓట్లు గుంజుకోవడమే తప్ప వైసీపీ తమ మిట్టపలెం ప్రాంతానికి చేసిందేమిలేదన్నారు. ఇంటూరి నాగేశ్వరరావు నాయకత్వంలో సమష్టిగా పనిచేసి, ఆయన గెలుపునకు అండగా నిలుస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో కందుల కొండయ్య, కందులు పోలయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పల్లపు నరసింగరావు, కుంచాల శ్రీను, కుంచాల వెకయ్య, కందుల మల్లికార్జున, కందుల అంకమరాజు, తన్నీరు నరసింహం, తన్నీరు అంకమ్మ, కందుల అంజయ్య, కందుల రవి, చల్లా ఆనందమ్మ, పల్లపు కొండయ్య, కందుల మాధవ, పల్లపు వెంకటేశ్వర్లు, కందుల గిరిబాబుతోపాటు మరో 15 కుటుంబాల వారు ఉన్నారు. మిట్టపాలెం ప్రాంతంలో ఏనుగుల దొరువు ఆదునీకరణతోపాటుగా వీధిలైట్లు, మంచినీటి వసతి, పైప లైన్ల నిర్మాణం, శ్మశానవాటిక సమస్యలను పరిష్కరించాలని ఇంటూరికి విన్నవించుకోగా అధికారం చేపట్టిన కొద్దిరోజులలోనే ఈ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవులు, చెన్నారెడ్డి మహేష్, కందుల నాగరాజు, చుంటి నరసింగరావు, జాజుల శ్రీనివాసులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కందుకూరు వైసీపీ కార్యకర్తలతో నాగేశ్వరరావు

పింఛన్ నగదు బ్యాంకు ఖాతాలో వేయవద్దు

● అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా

కావలి, మే 1: సామాజిక పింఛన్లు బ్యాంకు ఖాతాలో వేయవద్దని, వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు బుధం ఆరం కావలి ట్రంకురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకుల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు పడతారన్నారు. బ్యాంకులలో ఆర్థికలావాదేవీలు జరగకపోవటం వారి ఖాతాలలో బ్యాలెన్స్ సక్రమంగా లేకపోవడం, ఒక వేళ ఏదైనా అప్పులు ఉంటే బ్యాంకర్లు వాటిని తీసుకునే ప్రమాదం ఉందన్నారు. కనుక పింఛన్ ఇళ్ల వద్దనే ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు జరుగు మల్లి విజయరత్నం, చౌటూరి వెంకటరత్నం, రమేష్, రవికుమార్, జడ్డా వాసు, ముక్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, ఇంటూరిలను ఆశీర్వదించండి : దివి శివరాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

వలేటివారిపాలెం, మే 1 : ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావును ఆశీర్వదించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం కోరారు. వలేటివారిపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో శివరాం పాల్గొన్ని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాధు శ్రీలత, నాయకులు కాకుమాను ఆంజనేయులు, గోచిపాతల మోషే, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, కాకుమాని హర్ష, వీరమోసు అంజయ్య పాల్గొన్నారు.

అనంతసాగరం ఎస్సీ కాలనీ వాసులు టీడీపీలో చేరిక

కందుకూరు : మండలంలోని అనంతసాగరం ఎస్సీ కాలనీలో 10 కుటుంబాల వారు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సమక్షంలో బుధవారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతరం ఆయన అనంతసాగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీలో చేరిన వారిలో ఎస్సీ కాలనీకి చెందిన అక్కిలగుంట మాల్యాద్రి, నరసింహం, మాధవ, కోటేమ, రాకేష్, పెదమాలకొండయ్య, లక్ష్మి, ధనమ్మ, సువార్త, ధనమ్మ, లత, గౌడపేరు మాలకొండయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు నార్నె రోశయ్య, భైరపనేని కోటయ్య, భైరపనేని రమణయ్య, గోగినేని శివరామయ్య, బోయపాటి శ్రీనివాసులు, భైరపనేని నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు



కందుకూరు : జెండా ఆవిష్కరిస్తున్న రావుల

కందుకూరు, మే 1: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను బుధవారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. సీపీఐ అనుబంధ కార్మికసంఘం ఏఐటీయూసీ, సీపీఎం అనుబంధ కార్మికసంఘం సీఐటీయూల ఆధ్వర్యంలో వాడవాడలా అరుణ పతాకాలు రెపరెపలాడాయి. సీపీఐ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య, నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబులు ఎర్రజెండాలు ఎగురవేశారు. సీపీఐ కార్యాలయంతో పాటు కేసరిగుంట కాలనీ, ఉప్పుచెరువు, నాంచారమ్మకాలనీ తదితర ప్రాంతాలలో ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఎస్కే. హుస్సేన్, ఆదినారాయణ, ఎం. లక్ష్మీనారాయణ, వై.కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయంతో పాటు అంబేడ్కర్ బొమ్మసెంటర్, ఉప్పుచెరువు, సుందరయ్యనగర్, కోటారెడ్డి ఆసుపత్రి సెంటర్, ఆర్టీసీ డిపో సెంటర్, ఏరియా ఆసుపత్రి సెంటర్లలో కార్మిక పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ఏ గౌస్, మున్వర్‌సుల్తానా, డి. రామమూర్తి, ఎం.పద్మ, చదలవాడ మల్లికార్జున, టి.రాము, నరసింహం తదితరులు పాల్గొన్నారు.



కావలిటౌన్ : మేడే సంబరాల్లో కార్మికులు

కావలిటౌన్ : పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆటో యూనియన్‌లు, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎస్‌ల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. సీఐటీయు గౌరవాధ్యక్షుడు పెంచలయ్య పర్యవేక్షణలో ప్రదర్శన జరిగింది. మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుడు తిరుపాల్ జెండా ఆవిష్కరిచారు. కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. సీఐటీయూ నేతలు మల్లికార్జునరావు, వెంకయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, కృష్ణయ్య, శీనయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ముసునూరులోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో డిపో వద్ద జెండా ఆవిష్కరించారు.

లింగసముద్రం : లింగసముద్రంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరించి మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, చింతా సుధాకర్, ఆర్ అక్కయ్య, ఎస్కే హజరత్, శ్రీనివాసులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సీహెచ్ రమాదేవి, సీహెచ్ ప్రభావతి, కృష్ణకుమారి, మధులత, సీఐటీయు నాయకులు సురేష్ పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని ఇబ్రహీంపేటలో రైల్వే కార్మికులు, జువ్వలదిన్నెలో సీపీఎం సీనియర్ నేత కే.వెంకయ్య వ్యవసాయ కార్మికులు మేడే వేడుకలు జరుపుకున్నారు. ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయ ఆవరణలో మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డమ్ము భాస్కర్, శంకరయ్య, ఎన్.రామయ్య, సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘ మండల అధ్యక్షుడు తుమ్మల శీనయ్య, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

'బుర్రా' ప్రవర్తనతో కమ్మ సామాజిక వర్గానికి అవమానం!

● పార్టీ మారాలని నిర్ణయం : వైసీపీ నాయకులు

కందుకూరు, మే 1: కందుకూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ ప్రవర్తన కమ్మ సామాజిక వర్గానికి చాలా అవమానంగా ఉందని వైసీపీ సీనియర్ నాయకుడు కొల్లూరి కొండయ్య, వలేటివారిపాలెం మండల మాజీ కన్వీనర్ దామా మహేష్, మాజీ కౌన్సిలర్ పొడపాటి నాగేశ్వరరావు, వాకా నాగరాజారెడ్డి తదితరులు ఆరోపించారు. బుధవారం సాయంత్రం కందుకూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడ్డవారిని చిన్నచూపు చూడటమే గాక సామాజిక వర్గాల వారీగా కించపరిచేలా ప్రవర్తిస్తున్నారని, నాయకుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన వ్యవహారశైలి నచ్చక పార్టీ మారాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. జగన్ పాదయాత్ర సమయంలో నా ఇంట్లోనే బసచేశారని, ఆయనతో తనకు ఎంతో అనుబంధం ఉందని, అలాంటి నాపట్ల బుర్రా అహంకారపూరితంగా అవమానకరంగా ప్రవర్తించారని కొల్లూరి కొండయ్య విమర్శించారు. కమ్మ సామాజిక వర్గం ఓట్లేయకుంటే నేను గెలవలేనా అని మాట్లాడటమే కాక కమ్మ, రెడ్డి సామాజికవర్గంలోని కొందరి పేర్లు చెప్పి తాను గెలిచాక వారి ఫొటోలు పోస్టాఫీసు సెంటర్‌లో వేయించి ఏ అధికారి వీరికి పనిచేయడానికి లేదని ప్రకటిస్తానని మాట్లాడుతున్నారని ఆరోపించారు. కందుకూరు అభ్యర్థి ఎంపికలో జగన్ పొరపాటు చేశారన్నారు. ఈనెల 3న టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావుల సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

కాకర్ల సురేష్ కోసం ఇంటింటి ప్రచారం

కొండాపురం, మే 1: ఉదయగిరి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలపించాలంటూ మండలంలోని భీమవరప్పాడు పంచాయతీలో బుధవారం ఆయన సోదరుడు సునీల్ సతీమణి కాకర్ల సురేఖ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతోపాటు జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో అంశాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేసి దానివలన కలిగే ప్రయోజనాలను వివరించారు. రానున్న ఎన్నికలలో టీడీపీకి ఓటు వేయాలని, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, పరిశీలకుడు కే.సుబ్బారావు, మాజీ సర్పంచు సీహెచ్.క్రిష్ణ, ఎమ్.వెంకటేశ్వర్లు, వీ.శ్రీనావాసులు, నాయకులు యారవ క్రిష్ణయ్య, పీ.రమేష్, జనసేన నాయకులు ఆకుల వెంకట్, తిప్పినేని రమేష్, బీజేపీ, ఎమ్ఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాయమాటలకు మోసపోవద్దు

● పదేళ్లుగా ఏమి చేశాడో నిలదీయండి ● కావలి పట్టణం, రూరల్‌లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రచారం



31వ వార్డులో క్రిష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

కావలి/కావలి రూరల్, మే 1: పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలికి ఏమి చేశాడో ప్రజలు నిలదీయాలనిచ ఆయన మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఎన్డీఏ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య)క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కావలి పట్టణ 29, 31 వార్డులలో, రూరల్ మండలంలోని సిరిపురం, నారాయణపురం, చలంచర్ల గ్రామాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులలో ప్రజలు ఆయనకు బారీ గజమాలలతో స్వాగతించారు. ఆయన ప్రజల్లోకి వెళుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కూటమి మేనిఫెస్టో ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటేయాలని విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాపూజీ నగర్‌ను మున్సిపాల్టీ లేఅవుట్ వేసి విక్రయించినా నేటికీ కనీస మౌలిక వసతులు కల్పించకపోవటం దారుణమన్నారు. ఐదేళ్లుగా ఎమ్మెల్యే అధికారంలో ఉండి కూడా తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇక్కడ ప్రధాన సమస్యలైన డ్రైన్లు, రోడ్లు నిర్మాణం చేపడతానన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దనదాహంతో దాచుకోవటం దోచుకోవటం తప్ప అభివృద్ధిపై ద్యాస లేదన్నారు. కావలిని అరాచకాలకు, గంజాయికి కేంద్రంగా మార్చారన్నారు. ఆయన దోపిడీలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించి నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా 29వ వార్డులో ఇద్దరి వైసీపీ నాయకలు, 31వ వార్డులో గంగినాయుడు ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి కావ్య పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. కావలి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, మన్నవ రవిచంద్ర, జ్యోతి బాబూరావు, బీజేపీ నాయకులు కందుకూరి సత్య నారాయణ, అంచిపాకల కమల, కే.బ్రహ్మానందం, జనసేన నాయకులు పొబ్బా సాయి విఠల్, టీడీపీ నాయకులు సూరే మదన్‌మోహన్‌రెడ్డి, తటవర్తి వాసు, మంచాల ప్రసాద్, దామా మాల్యాద్రి, కాంద్ర గంగినాయుడు, మధుబాబు నాయుడు, మక్కెన హరిబాబు, విశ్వశాంతిరమణయ్య, తటవర్తి రమేష్ , జేజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● కావలిరూరల్ మండలం సిరిపురం, నారాయణపురం, చలంచర్ల గ్రామాలలో బుధవారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఎన్నికల ప్రాచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాలు మీదుగా కావలి కాలువ పోతున్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎండిపోతున్న పంటలకు సోమశిల నీరు అందించలేకపోవటంతో రైతులు నానా అగచాట్లు పడ్డారన్నారు. సిరిపురం చెరువుకింద ఉన్న రోడ్డుపైకి చెరువు నుంచి ఊట, మట్టి వస్తూ రోడ్డు దెబ్బతింటున్నా దానికి గోడ కట్టలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. ఈ ప్రాంత చెరువులలో ఉన్న గ్రావెల్, మట్టి అమ్ముకుని కోట్లు గడించారే కానీ చెరువులు బాగుచేద్దామన్న ఆలోచన వైసీపీకి లేదన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించినా ఆయన చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సిరిపురంలో గిరిజనులకు కనీసం పక్కా ఇళ్లు నిర్మించలేని దుస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వేసిన రోడ్లు, డ్రైన్లు తప్ప వైసీపీ పాలనలో ఎక్కడా తట్టెడు మట్టి వేయలేదన్నారు. సిరిపురం ఉపసర్పంచ్ ఉప్పాల జ్వాల రావు, వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఆయనను క్రిష్ణారెడ్డి సాదరంగా ఆహ్వా నించారు. ఒక్క అవకాశం ఇచ్చి తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడు రాంప్రసాద్, గంటా మల్లికార్జున, గుర్రం సునీల్, చాగంటి వెంకటేశ్వర్లు, మానం మోహన్,గుర్రం వెంకటసుబ్బయ్య, కోరా రమేష్, పరుసు తిరుపతి, కన్ని చెన్నయ్య, సుల్తాన్ బాష తదితరులు పాల్గొన్నారు.

● 28వ వార్డులో క్రిష్ణారెడ్డి తనయ ప్రచారం

కావలి పట్టణం 28వ వార్డులో బుధవారం క్రిష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టి ఎమ్మెల్యేగా తన తండ్రిని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, వార్డు ఇన్‌చార్జి నాగిశెట్టి మాలకొండయ్య, గంగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సిరిపురం ఉపసర్పంచు జ్వాలరావును ఆహ్వానిస్తున్న క్రిష్ణారెడ్డి



28వ వార్డులో ప్రచారం చేస్తున్న క్రిష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి

వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాలోని సాగునీటి సంఘాలు నిర్వీర్యమయ్యాయి. అధికారంలోకి రావడంతోనే సాగునీటి సంఘాలను రద్దు చేసింది. సాగునీటి సంఘాలు నిర్వీర్యం కావడంతో ఈ ఐదేళ్ల కాలంలో ఒక పంట కాలువలో కూడా పూడికతీత చేపట్టలేదు. దీంతో పంట పొలాలకు నీరు పారక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. చివరకు రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత నిధులతో పూడికతీత చేపట్టారు.

అధ్వానంగా పంట కాలువ



- ఐదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థ
- పంట కాలువలు అధ్వానం
- కనీస నిర్వహణ కూడా కరువు
- సాగునీటికి ఆయకట్టుదారుల ఇబ్బందులు
- అన్నదాతలే స్వచ్ఛందంగా పూడికతీత

● పూడిపోయిన కాలువలు

జిల్లాలో ఇటు డెల్టా, నాన్‌డెల్టా (చెరువులు, బావులు) కింద సుమారు 8 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టులో వందలాది కాలువలు ఉన్నాయి. ఈ కాలువల్లో ఏటా పూడిక తీస్తేనే పొలాలకు సాగునీరు అందేది. లేకపోతే సాగునీరు పారుదల కష్టం. సాగునీటి సంఘాలు లేకపోవడం, నిధులు మంజూరు కాకపోవడంతో ఈ నాలుగేళ్ల పంట కాలువలో నాచు, గుర్రపుడెక్క తొలగించిన పాపాన పోలేదు. దీంతో సాగునీరు పారడం కష్టంగా మారింది.

● రైతులే స్వచ్ఛందంగా..

డెల్టాలో కొన్ని కాలువల్లో పూడికతీసే నాథుడే లేకపోవడంతో రైతులే చందాలు వేసుకుని పూడికతీత చేపట్టారు. ఇలాంటి పరిస్థితి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని అన్నదాతలు అంటున్నారు.

నీటి సంఘాలకు
నీళ్లొదిలారు!

సంగం, మే 1 : జిల్లాలో 738 సాగునీటి సంఘాలు ఉండగా, ప్రతి ఐదేళ్లకోసారి వీటికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఒక్కో సంఘంలో అధ్యక్షుడితోపాటు ఐదుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వీరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనుమతితో ఇరిగేషన్ అధికారుల సమక్షంలో సంఘాలు పనిచేస్తాయి. పొలాల నుంచి రెవెన్యూ శాఖ వసూలు చేసే నీటి తీరువా పన్నుల ద్వారా నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో సాగునీటి సంఘాలు ఆయకట్టు పరిధిలోని అవసరమైన కాలువల్లో పూడికతీత చేపట్టేవారు. ప్రతి ఏటా సీజన్‌కు ముందు నిధుల కోసం ఎదురుచూడకుండా సంఘాల ఆధ్వర్యంలో పంట కాలువల్లో నామినేషన్ కింద పూడికతీత చేపట్టేవారు. తద్వార సాగునీటి కాలువలో సజావుగా నీరు పారడంతో పంటలు పుష్కలంగా పండేవి. నీటి తీరువా పన్ను వసూలు ఆలస్యమైనా ఆరు నెలలకో, ఏడాదికో మంజూరయినప్పుడు బిల్లులు తీసుకునేవారు.

● సాగునీటి సంఘాల రద్దు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో సాగునీటి సంఘాలను రద్దు చేసింది. వీటి బాధ్యతలను సంఘాల స్థాయిని బట్టి ఆయా ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని ఏఈ, డీఈ, ఈఈ, ఎస్‌ఈలకు అప్పగించారు. దీంతో కాలువల పూడికతీత బాధ్యత అధికారులపై పడింది. అంతేగాక రూ.లక్ష పైబడిన పనులకు టెండర్ విధానం తీసుకువచ్చారు. దీంతో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం యథావిధిగా జిల్లాలోని పంట కాలువల పూడికతీత పనులకు ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి టెండర్లను చేజిక్కించుకుని పనులు చేశారు. నిధులు విడుదల కాలేదు. ఈ క్రమంలో టీడీపీ హయాంలో చేసిన పనులకు సాగునీటి సంఘాలకు జిల్లాలో సుమారు రూ. 100 కోట్ల బకాయిలు ప్రభుత్వం ఇవ్వాలి. వాటిని విడుదల చేయకుండా ఆ సంఘాలను రద్దు చేశారు. దీంతో ఆ సంఘాల అధ్యక్షులు కోర్టును ఆశ్రయించారు. ఆ పనులకు అనుమతిచ్చిన జిల్లా కలెక్టర్‌ను బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో జిల్లా కలెక్టర్లకు సైతం సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత కాలువలకు పూడికతీతకు అనుమతి ఇవ్వక, ఇచ్చిన బిల్లులు రావని పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.



యంత్రం సహాయంతో రైతులే స్వచ్ఛందంగా పూడికతీస్తున్న పంట కాలువ

పంట కాలువలు అధ్వానం



తరుణవాయిలో నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. నాలుగేళ్లుగా పంట కాలువలు పూడికతీత చేపట్టక అధ్వానంగా తయారయ్యాయి. నీళ్ల పారక దిగుబడి తగ్గిపోయి నష్టాలు వచ్చాయి.

- తిప్పిరెడ్డి, ఏఎస్ కండ్రిక, సంగం

సొంత నిధులతో పూడికతీత



వైసీపీ పాలనలో పంట కాలువల్లో పూడిక తీయలేదు. అధికారుల చుట్టూ తిరిగాం. పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో రైతులంతా మాట్లాడుకుని చందాలు వేసుకుని కాలువల్లో పూడికలు తీసుకున్నాం.

- రమణారెడ్డి, రైతు, వెంకటేశ్వరపురం

స్కిల్ సెన్సెస్ అంటే ఏందన్నా..!

అదీ సంగతి



అన్నా... చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ రెండు రోజుల క్రితం విడుదల చేసిన మేనిఫెస్టో చూసావా..? చూసా తమ్ముడూ... దాంట్లో స్కిల్‌సెన్సెస్ చేపతామని చెప్పారన్నా... అంటే ఏందన్నా... అర్థం కావట్లే..? ఓ అదా తమ్ముడూ... స్కిల్‌సెన్సెస్ అంటే మనం ఇంతవరకు కులగణాంకాలు, మత గణాంకాలు చూసాం కదా.. అలానే అది నైపుణ్య గణాంకం... చంద్రబాబు విజనరీ కదా... ఆయన గొప్ప ఆలోచనతో ఇంతవరకు దేశంలోనేకాదు.. ప్రపంచంలోనే ఏదేశంలోనూ చేపట్టని విధంగా స్కిల్‌సెన్సెస్‌ను రాష్ట్రంలో చేపట్టనున్నారు. అంటే ప్రతి వ్యక్తికి ఏరంగంలో నైపుణ్యం ఉంది... ఏ రంగంలోనూ నైపుణ్యం లేకపోతే ఏ రంగంపై వారికి ఆసక్తి ఉంది... అని స్త్రీ, పురుషుల వద్ద నుంచి గణాంకాలు సేకరిస్తారు తమ్ముడూ... దీని వల్ల ఏం ఉపయోగం అన్నా... ఉంది తమ్ముడూ... ఏదైనా ఒక వ్యక్తి తనకు ఏదో ఒక రంగంలో నైపుణ్యం ఉండి, ఆ నైపుణ్యంతో ఆర్థికంగా ఎదగాలంటే పెట్టుబడి లేక తన నైపుణ్యాన్ని వృథా చేసుకుంటాడు. అలా కాకుండా ప్రభుత్వం తరుపున ఏరంగంలో అయితే ఓ వ్యక్తికి నైపుణ్యం ఉంటుందో దానికి తగ్గట్టు ప్రభుత్వం ఆసరా కల్పించి ఆ వ్యక్తి నైపుణ్యం వృథా కాకుండా చేయూతను అందిస్తుంది. దాంట్లో ఆర్థికంగా ఎదిగేలా చేస్తుంది. అయితే తమ్ముడూ ఈ స్కిల్స్ అనేవి పైచదువులు చదివిన వారికే కాదు.. కొద్దిగా చదువుకుని కార్పెంటర్‌గా, రాడ్‌బెండర్‌గా, భవననిర్మాణ కార్మికుడిగా, డ్రైవర్‌గా... ఇలా ఒక్కొక్కరికి ఒక్కో రకం నైపుణ్యం ఉంటుంది కదా..? అవన్నీ ప్రభుత్వం గణాంకాలు సేకరించడం ఈ స్కిల్‌సెన్సెస్ లక్ష్యం... ఓ అలాగా అన్నా ఈ స్కిల్‌సెన్సెస్ వల్ల ఇంత ఉపయోగం ఉందా... సూపర్ అన్నా... అన్నా... చంద్రబాబునాయుడు ఎట్టినా తెలివైనోడన్నా... ఎప్పుడూ ఆయన మైండ్ సెట్ యువత తన కాళ్ల మీద తాను నిలబడి రాష్ట్రానికి ఎలా ఉపయోగపడతారనే దానిపైనే ఉంటుందన్నా... ఆయన విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రపంచంలో ఏ ప్రభుత్వం చేపట్టని స్కిల్‌సెన్సెస్‌ను చేపతామని చెప్పారన్నా.. సూపర్బ్ అన్నా.. చంద్రబాబా.. మజాకా ..!

- జలదంకి


ముఖచిత్రం

● గతంలో మాస్ రాజకీయాలకు అడ్డా

● నేడు అభివృద్ధికి పట్టం

హేమాహేమీల సెగ్మెంట్
నెల్లూరు సిటీ





నెల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం అంటే ఏసీ సుబ్బారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, పోలుబోయిన అనీల్‌కుమార్ వంటి మాస్ లీడర్లు గుర్తుకొస్తారు. వీరంతా ప్రజల మధ్యే తిరుగుతూ రాజకీయం చేసిన నాయకులు. నాడు మాస్ రాజకీయాలకు అడ్డాగా ఉన్న నగర నియోజకవర్గం నేడు అభివృద్ధికి పట్టం కడుతోంది.

ఇప్పుడు నెల్లూరు సిటీగా ఉన్న అసెంబ్లీ నియోజకర్గం 2009కు ముందు నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడ్డాక నెల్లూరును నెల్లూరు సిటీ అసెంబ్లీ సీటుగా మార్పు చేశారు. నెల్లూరు నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. 1952 నుంచి 1983 వరకు నెల్లూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా కొన సాగించింది. అప్పట్లో కాంగ్రెస్‌కు పోటీగా గట్టి రాజకీయ పార్టీలు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులే పోటీకి దిగేవారు. ఆ సమ యంలో ఆనం చెంచు సుబ్బారెడ్డి(ఏసీ సుబ్బారెడ్డి), ఆనం వెంకటరెడ్డి వంటి ఉద్ధండులు నెల్లూరు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి నెల్లూరులో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. 1983లో టీడీపీ తరపున ఆనం రామనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 1989లో జక్కా కోదండరామిరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించారు. 1994లో తాళ్లపాక రమేష్‌రెడ్డి టీడీపీ తరపున విజయం సాధించి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో పనిచేశారు. 1999, 2004లలో జరిగిన ఎన్నికల్లో ఆనం వివేకానందరెడ్డి వరుసగా రెండుసార్లు గెలుపొందారు. అప్పుడే రాజకీయాల్లో ఆనం మార్క్ ఏర్పడింది.

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ
2019	పీ అనీల్‌కుమార్ యాదవ్	వైసీపీ
2014	పీ అనీల్‌కుమార్ యాదవ్	వైసీపీ
2009	ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి	పీఆర్‌పీ
2004	ఆనం వివేకానందరెడ్డి	కాంగ్రెస్
1999	ఆనం వివేకానందరెడ్డి	కాంగ్రెస్
1994	తాళ్లపాక రమేష్‌రెడ్డి	టీడీపీ
1989	జక్కా కోదండరామిరెడ్డి	ఇండిపెండెంట్
1985	కూనం వెంకటసుబ్బారెడి	కాంగ్రెస్
1983	ఆనం రామనారాయణరెడ్డి	టీడీపీ
1978	కూనం వెంకటసుబ్బారెడ్డి	కాంగ్రెస్
1972	ఆనం వెంకటరెడ్డి	కాంగ్రెస్
1967	ఎంఆర్ అన్నదాత	జనసంఘ్
1962	గంగా చిన కొండయ్య	కాంగ్రెస్
1955	ఆనం చెంచు సుబ్బారెడ్డి	కాంగ్రెస్

ఇక 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో నెల్లూరు సిటీగా రూపాంతరం చెందిన నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 2014, 2019 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్ గెలుపొందారు. ఆయన జగన్మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. 2014లో పొంగూరు నారాయణ సిటీ నుంచి పోటీ చేయకపోయినా మున్సిపల్ శాఖ మంత్రిగా ఆయన నెల్లూరు సిటీని సొంత నియోజకవర్గంగా ఎంచుకున్నారు. అలానే 2019లో నారాయణ సిటీ నుంచి పోటీ చేశారు. కాగా 1983 తర్వాత రెండు సార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ, ఓసారి పీఆర్పీ విజయం సాధించా యి. ప్రస్తుతం టీడీపీ నుంచి పొంగూరు నారాయణ, వైసీపీ నుంచి ఎండీ ఖలీల్ అహ్మద్‌లు పోటీ పడుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న పలువురు ఉద్ధండ రాజకీయ నాయకులు నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడం విశేషం.

దుస్థితిలో ఉదయగిరి నియోజకవర్గ రోడ్లు

తట్టెడు మట్టి వేయని వైనం

నువ్వు నడిచిన దారే
జగనన్నా..!

కొండాపురం, మే 1 : గత (2019) సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్మోహనరెడ్డి ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని కలిగిరి, కొండాపురం మండలాల పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేశారు. కలిగిరి మండలం తూర్పుగుడ్లదొన గ్రామం నుంచి 40 కిలోమీటర్ల దూరం జగన్ పాదయాత్ర చేశారు. జగన్ నడచిన ఈ రహదారిలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఉన్నాయి. ఆయన యాత్ర కొండాపురం మండలం శెట్టిపాలెంలోకి పాదయాత్ర ప్రవేశించి రాళ్లపాడు రిజర్వాయరు వరకు సుమారు 15 కిలోమీటర్ల దూరం సాగింది. ఆరోడ్డులో కూడా అప్పటికే చిన్నపాటి గుంతలు ఉండగా అవి నేడు పెద్ద గుంతలుగా మారాయి. గెలిచిన తర్వాత జగన్ ఈరోడ్డు సంగతే పూర్తిగా మరచిపోయాడు. ఈ విషయమై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



దెబ్బతిన్న కొండాపురం-కలిగిరి రోడ్డు మార్జిను



గుడవళ్లూరు గ్రామం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత



ఆది మూర్తి పురం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

ఈసారి సెలవలన్నీ ఇంటికాడే !

రమేష్ : అరే... బావా.. ఈ సారి పిల్లల సెలవలకి ఎక్కడికి పోలేని పరిస్థితిరా... ఈ ఎలక్షన్లు కూడా ఇప్పుడే వచ్చాయి కర్మగాలి..

సాయి : పోన్లే రే మావా. ఖర్చంతా మిగిలిపోయిల్లా... ఎండలు తప్పించుకుంటివి. హాయిగా ఇంటికాడే ఉండు

రమేష్ : ఇంటిదగ్గర యాడ్రా ఉండేది. మన పార్టీవోళ్లు ఉంచుతుండ్రా... రోజు ప్రచారాలకి తీసుకోపోతుడ్రే...!

సాయి : పోకపోతే ఏంట్రామావా. పార్టీ అధికారంలోకి రావద్దా... రేపు అధికారంలోకి వస్తేనే కదా... మాన మాట సాగేది.

రమేష్ : అది నిజమే కానీ... పాపం పిల్లలు ఫీలైపోతున్నార్రా... సెలవలకు ఎక్కడికి తీసుకుపోవట్లేదని..

సాయి. : ఇంకెంతలే మావ బిర్రుగా 12 రోజులు. కళ్లుమూసుకుని తెరిసేలోపు అయి పోతాయి. ఆ తరువాత నీ ఇష్టం..!

- నెల్లూరు రూరల్



తొలి బీసీ ఎమ్మెల్యే చెంచురామయ్య

తెలుసుకుందాం



నెల్లూరు జిల్లాలో వెనుకబడిన తరగతుల(బీసీల)కు చెందిన తొలి ఎమ్మెల్యేగా పొన్నెబోయిన చెంచురామయ్యయాదవ్ ఎంపికయ్యారు. ఆయన 1972-78 వరకు ఉదయగిరి శాసనసభ్యుడిగా పనిచేశారు. అప్పట్లో మాదాల తిమ్మయ్య(స్వతంత్ర), పొన్నెబోయిన చెంచురామయ్య యాదవ్(కాంగ్రెస్)లు పోటీ చేయగా తిమ్మయ్యకు 15,858 ఓట్లు రాగా, చెంచురామయ్యకు 30,082 ఓట్లు వచ్చాయి. 1975 ఫిబ్రవరి 24న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఉదయగిరి ప్రాంత సమస్యలపై గొంతెత్తారు. పేదలు అధికంగా ఉండే మా నియోజకవర్గ ప్రజలు రాగి సంగటి తింటున్నారని, వరి అన్నానికి నోచుకోలేదని ఆయన గళమెత్తారు. వారి బాధ నేను చూడలేకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారంతోనే పంటలు పండించే తన నియోజకవర్గంలో జలాశయం నిర్మిస్తే రైతులు వరి సాగు చేసి అన్నానికి నోచుకుంటారన్నారు. గండిపాలెంలో జలాశయ నిర్మాణానికి చర్యలు తీసుకోకపోతే ఇక తాను అసెంబ్లీలో అడుగుపెట్టనని భీష్మించారు. ఈ తరుణంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రూ.1.30 కోట్ల నిధులతో 1975 మండలంలోని గండిపాళెం జలాశయానికి శంకుస్థాపన చేశారు.

- ఉదయగిరి

అక్రమ మైనింగ్‌తో తాగునీరు కలుషితం

● కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ

సైదాపురం, మే 1: మండలంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలతో తాగునీరు కలుషితమే కాకుండా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయి ప్రియ అన్నారు. బుధవారం కట్టుబడిపల్లి, దేవర వేమూరు, కలిచేడు గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కట్టుబడి పల్లిలో రాపూరు మాజీ ఏఎంసీ చైర్మన్ నోటి రమణారెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి ఆమె కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలో తన తండ్రి చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వం ఏమీ చేపట్టలేదన్నారు. కైవల్యానదిపై కొత్త వంతెన నిర్మాణం చేట్టిన ఘనత తన తండ్రిదే అన్నారు. అలాగే దేవరవేమూరుకు కండలేరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టారన్నారు. చైన్నైలో వ్యాపారాలు ఉన్న ప్రజా సేవ కోసం వెంకటగిరిలోనే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. ఏ సమయంలో ఇంటి తలుపు తట్టినా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కురగొండ్ల రామకృష్ణకు సైకిల్ గుర్తు, తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రాద్‌రావుకు కమలం గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు, మండల టీడీపీ పరిశీలకుడు తానంకి నానాజీ, వెంకటగిరి నియోజక వర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి, నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, కీర్తిపాటి రాజశేఖర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీసాయి ప్రియకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పేదల సంక్షేమం కోసం కూటమి మోడల్ మేనిఫెస్టో

● సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి

ముత్తుకూరు, మే 1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఆధ్వర్యంలో మోడల్ మేనిఫెస్టో అని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వల్లూరు, డమ్మాయిపాలెం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న జే బ్రాండ్ మద్యాన్ని రద్దు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, వల్లూరు మోహన్‌రావు, మల్లికార్జున్, మునిరెడ్డి, నర్సారెడ్డి, శ్రీనివాసులు, సునీల్, బీజేపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● పిడతాపోలూరుకు చెందిన 45 కుటుంబాలు స్థానిక నాయకుడు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు కార్యాలయంలో సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

●**వెంకటాచలం:** వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో బుధవారం మండలంలోని కంటేపల్లి, కసుమూరు గ్రామాల నుండి 45 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జూన్ 4న ప్రజా ప్రభుత్వం ఏర్పాటు

పొదలకూరు: త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి, జూన్ 4న ప్రజా ప్రభుత్వం ఏర్పడనుందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఇను కుర్తి, ముదిగేడు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుతగా పొదలకూరు సంగంరోడ్డు, ముదిగేడులో పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్ బాబు, మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


ముత్తుకూరు : ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి

కాకాణి అరాచకాలు భరించలేకే చేరికలు

తోటపల్లి గూడూరు: కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరాచకాలు భరించలేక గ్రామాల్లో పెద్దఎత్తున టీడీపీలో చేరుతున్నట్లు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరుకూరు పంచాయతీ జానావారిపాలెంలో బుధవారం అన్నం సురేంద్ర ఆధ్వర్యంలో వైసీపీని వీడి 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి శృతిరెడ్డి, కొణతం రఘుబాబు, పాకం వెంకయ్య, అన్న శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బీజేపీ నేత తుళ్లూరు జనార్దన్ పాల్గొన్నారు.

ఐఏఎస్‌లు సేవకులా... బానిసలా?

నెల్లూరు (సాంస్కృతికం) : ప్రస్తుతం విధి నిర్వహణలో ఉన్న ఐఏఎస్ అధికారుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని, వీరు రాజకీయ పార్టీలకు బానిసలా, సేవకులా అని మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పీవీ రమేష్ ప్రశ్నించారు. బుధవారం రాత్రి పురమందిరంలో పీపుల్స్ డెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన ఓటరు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ప్రస్తుత రాజకీయాల్లో నిజాయితీగా పని చేయడం కష్టంగా ఉందన్నారు. రాజకీయాల్లో మార్పు రావాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా ఓటే ఆయుధం అన్నారు. మద్యం, డబ్బుకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి ఎస్‌కే ఖాసిం, కార్యక్రమ నిర్వాహకుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కుట్టి కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు లతీఫ్, విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు అశోక్, కిన్నెర వెంకటేశ్వర్లు, ముదివర్తి బాబు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డీబార్

వెంకటాచలం, మే 1: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో ఒకరు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 551 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 247 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శులుగా కృష్ణచైతన్య, వీరేంద్ర

విడవలూరు/ నెల్లూరు (హరనాథపురం) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా విడవలూరుకు చెందిన చెముకుల కృష్ణచైతన్య, ఇందుకూరు పేటకు చెందిన రావెళ్ల వీరేంద్ర నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా పార్టీకి చేసిన సేవలకు గుర్తింపునిస్తూ ఈ పదవి రావడం గర్వంగా ఉందన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.


కృష్ణ చైతన్య


వీరేంద్ర

కోవూరు సర్వేపల్లి

టీడీపీ మేనిఫెస్టో మహిళలకు వరం

● చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మహిళలు

పొదలకూరు, మే 1: ఎన్డీఏ కూటమిలో భాగంగా టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో మహిళలకు వరం లాంటిదని పొదలకూరు టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ అధినేత నారా చంద్ర బాబునాయుడు చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, దేవరం సాయి సుదీప, పొదలకూరు మండలం మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

వాడవాడలా మే డే వేడుకలు


పవ్వేరు బ్యాంకు వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆటో, హమాలీలు, తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, మే1: బుచ్చి పట్టణంతోపాటు దామరమడుగు, పెనుబల్లి, జొన్నవాడ, కాళయకాగొల్లు, మినగల్లుతోపాటు పలు గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జీపు స్టాండు, బియ్యం గోడౌన్ హమాలీల ఆధ్వర్యంలో పవ్వేరు బ్యాంకు తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసి మజ్జిగ పంపిణీ చేశారు. మేడే వేడుకల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, అంగన్‌వాడీ, ఆటో హమాలీ వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

● **వెంకటాచలం:** మండలంలోని అనికేపల్లి, వెంకటాచలం, తిక్కవరప్పాడు, సర్వేపల్లి, నిడిగుంటపాళెం గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు మండల కార్యదర్శులు ఓడూరు వెంకటకృష్ణయ్య, గుండాల ఇరగాలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు పొట్టేపాళెం సుధాకర్, నాయకులు సుబ్బరామయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి


కోవూరు: పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య, సీపీఎం నాయకులు జక్కా శేషమ్మ,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

వెంకటాచలం, మే 1: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం మండలంలోని ఎగువమిట్టలో ఒక పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం పద్మమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి హాస్పిటల్‌కి వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి లోపల మంటలు వ్యాపించడంతో దుస్తులు, తదితర వస్తువులు, 8 సవర్ల బంగారం, రూ.3లక్షలు నగదు బూడిదయ్యాయి. వెంటనే గ్రామస్థులు, చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.

జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి

● ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి



నెల్లూరు (విద్య), మే 1 : జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ అన్ని చర్యలు చేపడుతోందని విద్యాశాఖ ఆర్‌జేడీ బీ లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్స్(సీఆర్ఎంటీ)తో ఆయన సమీక్ష జరిపారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు. పాఠశాల కాంప్లెక్స్‌ల పరిధిలో సీఆర్ఎంటీలు ఎంతో కీలకంగా వ్యవహరించాలని, పాఠశాలల్లో ఏ జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అవసరమైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించా రు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయడం, విద్యాకానుకల పంపిణీ, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, నాడు-నేడు పనులను పర్యవేక్షించడం, పాఠశాలల్లో ఇంటరాక్ట్ ప్యానెల్స్ ఏర్పాటులో సహకరించడం వంటి సేవలందించాలన్నారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, వారిని తిరిగి పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యా శాఖ అధికారులకు ఆదేశాలందించామన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి, కావలి డిప్యూటీ ఈవో రఘురామయ్య, ఎస్ఎస్ఏ ఏఎంవో సుధీర్‌బాబు, ఎంఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కోసమే పనిచేస్తా!

● ఇందిరాక్రాంతి పథం ఏపీఎం వ్యాఖ్యలపై దుమారం

● చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్

కోవూరు, మే 1 : వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని, అధికారిక బాధ్యతలకన్నా ఎన్నికల ప్రచారమే తనకు ముఖ్యమని ఇందిరా క్రాంతి పథం ఏపీఎం వెంకటస్వామి సెల్‌ఫోన్‌లో చేసిన వ్యాఖ్యలు ఇవి. ఇటీవల వెలుగు కార్యకర్తలతో ఏపీఎం ఫోన్ చేసి మాట్లాడారు. ఫోన్‌లో జరిగిన సంభాషణ ఆడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈవ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ కోవూరు మండల అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్నను గెలిపించడమే తన లక్ష్యమని ఏపీఎం వెలుగు సిబ్బందిని కోరడం ఎన్నికల నియమావళిని ఉల్లఘించడమేనన్నారు. ఈ విషయమై తాము రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు పట్టించుకోకపోతే రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ ఏపీఎంకు ఎంపీడీఓ వీరాంజనేయులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

పారిశ్రామికవేత్త జేఎస్‌రెడ్డి కన్నుమూత



నెల్లూరు (సాంస్కృతికం) మే1: పారిశ్రామిక వేత్త, కళాపోషకుడు జక్కా శ్రీనివాసులురెడ్డి (జేఎస్ రెడ్డి) బుధవారం ఉదయం బెంగళూరులో కన్ను మూశారు. ఆయన మృతిపట్ల పలువురు జిల్లా వాసు లు దిగ్భ్రాంతికి గుర య్యారు. ఆయన అంత్యక్రియలు గురువారం ఉదయం 9గంటలకు బెంగళూరులో జరు గుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణం పట్ల మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ప్రపంచ తెలుగు మహాసభ రీజియన్ చైర్మన్ ఎన్.బలరామయ్యనాయుడు, తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం). మే 1: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు సంతపేట గోపి టీ స్టాల్ సెంటర్‌లో షేక్ మల్లిక అనే మహిళ తన ఇద్దరు కుమారులు రఫీ, సర్దార్(22)లతో కలిసి నివాసం ఉంటున్నది. రఫీ బంగారు పని చేస్తుండగా, సర్దార్ చిన్నబజారులోని ఓ మెటల్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. గత నెల 30న సాయంత్రం మల్లిక కోట మిట్టలోని షాదీమంజిల్ వద్దకు వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సర్దార్ ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు మృతుడి తల్లి, అన్నకు సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకుని సర్దార్‌ను కిందకు దించి బృందావనంలోని ఓ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి మల్లిక సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత ఆనకట్ట తొలగింపు పనుల పరిశీలన


ఆనకట్ట మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంగం, మే 1: పెన్నానది వద్ద ఉన్న పాత ఆనకట్ట తొలగింపు పనులను బుధవారం తెలుగుగంగ ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకట రమణయ్యలు పరిశీలించారు. సంగం ఆనకట్ట శిథిలాస్థితికి చేరడంతో నూతనం బ్యారేజీ నిర్మించి ఏడాది కిందటే ప్రారంభించిన విషయం విదితమే. పాత ఆనకట్టకు 450 మీటర్ల దిగువున కొత్త బ్యారేజీని నిర్మించారు. ప్రస్తుతం నూతన బ్యారేజీ ఆధారంగా నీటిని నిల్వ చేస్తే పాత ఆనకట్టతో నీళ్ల వెనుకకు మళ్లీ బీరాపేరు పొలాలు ముంపునకు గురవుతున్నాయి. అంతేకాకుండా నీటి నిల్వ లెక్క కట్టేందుకు తేడా వస్తుంది. దీంతో పాత ఆనకట్ట క్రస్ట్ లెవల్ వరకు తొలగించాలని స్థానిక ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఆ మేరకు తెలుగుగంగ అధికారులు, ఇరిగేషన్ క్వాలిటీ అధికారులు దీన్ని పరిశీలించారు.. ఆనకట్ట వారధిని కదిలించకుండా క్రస్ట్ లెవల్ వరకు తొలగించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. కార్యక్రమంలో తెలుగుగంగ అధికారులు, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

దోపిడీయత్నం కేసులో ఏడేళ్ల జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), మే 1 : నిద్రపోతున్న ఓ మహిళపై రోకలితో దాడిచేసి దోపిడీ యత్నానికి ప్రయత్నించాడన్న కేసులో నేరం రుజువు కావడంతో షేక్ అబ్దుల్లా అనే నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ నెల్లూరు ఒకటవ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్ శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, నెల్లూరు నగర పరిధిలోని కొత్తూరు లాయర్స్ కాలనీలో 2016 మార్చి 26వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో మొద్దిలేటి అక్కగారి సుజాత తన ఇంటికి సమీపంలోని బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా శబ్దం వచ్చింది. శబ్దం ఎందుకు వచ్చిందని చూడగా నిందితుడు అబ్దుల్లా మచ్చుకత్తితో దాడికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో అతను పారిపోయాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా కుమార్తె శశికళ(20) రక్తపు మడుగులో పడి ఉంది. పక్కనే ఉన్న రోకలి బండకు రక్తం అయిఉంది. దాంతో అమె నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని పట్టుకుని అతడిపై దోపిడీ యత్నానికి ప్రయత్నించినట్లు కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇసనాక నీరజ వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	278
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6752
వెండి కిలో ధర	రూ. 81,800
వెండి ఒక గ్రాము	రూ. 83.80

ఓటుతో వైసీపీని తరిమికొట్టండి : ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, మే 1: ఓటుతో వైసీపీని తరిమికొట్టాలని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తూరులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తూరులో రోడ్లను వేయిస్తామని, గ్రామంలోని శ్మశాన వాటికలన్నింటికీ ప్రహరీ గోడలు నిర్మించి రహదారులు ఏర్పాటు చేస్తామన్నారు. రావూరికి డొంక ఏర్పాటు చేస్తామని, షాదీమంజిల్‌లో భోజనశాల ఏర్పాటుచేసి వధూవరులకు గదులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలలో తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తామని, సైడు కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పల్లిపాడు గ్రామంలో టీడీపీ రజక సాధికార కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రశాంతిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కోవూరు మధు, నాయకులు సిద్ధయ్య, శ్రీనివాస్, రఫీ పాల్గొన్నారు.


ఇందుకూరుపేట : ప్రచారం నిర్వహిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నియోజకవర్గంలో అవినీతి లెక్క తేలుస్తాం

కొడవలూరు: గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో జరిగిన అవినీతి లెక్క తేలుస్తామని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో రామన్నపాళెంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని, ఆ దిశగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఆరుసార్లు ఎమ్మెల్యేనని గొప్పలు చెప్పుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమం మరిచారన్నారు. వైసీపీ అసమర్థ పాలనకు ప్రజలు చరమగీతం పాడి తగిన బుద్ధి చెప్పాలన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ప్రత్యక్ష రాజకీయాలలోకి రాకముందే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పలు ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టారని, ఆయనను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు కెవిఆర్ విజయ్ పర్యవేక్షించగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, డేగా దయాకర్‌రెడ్డి, నిశ్చల్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు శేషు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యం

సార్వత్రిక ఎన్నికలలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమని టీడీపీ నాయకుడు బెజవాడ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలకేంద్రమైన కొడవలూరు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని, వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

గండవరం సర్పంచి టీడీపీలో చేరిక

నెల్లూరు(హరనాథపురం): కొడవలూరు మండలం గండవరం గ్రామం, గౌతమ్ నగర్‌కు చెందిన సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్, తన అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. టీడీపీ నేత వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని వీపీఆర్ ఇంటికి చేరుకున్న వారికి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంతిరెడ్డి పార్టీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జనార్థన్, నాగిరెడ్డి శీనయ్య, కోవూరు కృష్ణ, ఆంటోని, ప్రసన్న ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విడవలూరు: మండల పరిధిలోని పార్ల పల్లి, వీరారెడ్డిపాళెం దండిగుంట గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధ వారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్ల పల్లిలో స్థానిక టీడీపీ నాయకులు వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, పూండ్ల ఏసోబు ఆధ్వర్యంలో గ్రామ మాజీ వలంటీర్, దళిత, గిరిజన గౌడ సంఘానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సుమారు 50 మంది, వీరారెడ్డిపాలెంలో టీడీపీ నాయకుడు మాధవ్ ఆధ్వర్యంలో 20మంది వైసీపీ కార్యకర్తలు, దండిగుంట గ్రామంలో స్థానిక టీడీపీ నాయకుడు కుడుముల మల్లికార్జున, బద్దిపూడి రాజ, ముజామిల్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు గోల్ల వెంకటరమణయ్య, గంగపట్నం సునీల్, జొన్నవాడ వెంకయ్య, శ్రీపతి కరుణాకర్, పిడుగు శ్రీనివాసులు వారి అనుచరులు 50 మంది టీడీపీలో చేరారు. వీరికి ప్రశాంతి రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం : ఐషితారెడ్డి

కోవూరు: చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోడలు ఐషితారెడ్డి కోరారు. స్థానిక గమళ్లపాలెంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మహలక్ష్మమ్మ ఆలయం ఎదుట ఆమె కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడారు. వేమిరెడ్డి దంపతులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రచారంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ జానా శేషమ్మ, నాయకులు శివకుమార్, నిరంజన్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

రైతు ద్రోహి జగన్ : పుట్టా

బుచ్చిరెడ్డిపాళెం: రీసర్వే పేరుతో రైతు పాసుపుస్తకాల మీద రైతులకు బదులు తన ఫోటోలు వేసుకున్న జగన్ రైతు ద్రోహి అని టీడీపీ నాయకుడు పుట్టా సుబ్రమణ్యంనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని నాగమాంబాపురం పంచాయతీ విలియమ్స్‌పేట (కొట్టాలు) గ్రామంలో ఆ గ్రామ టీడీపీ ఇన్‌చార్జ్ వంటేరు గిరితోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆయన వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


ప్రశాంతి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన గండవరం సర్పంచి, ఇతర నాయకులు


కోవూరు: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఐషితారెడ్డి

మే డే సంబరాలు

- పలుచోట్ల ఎర్ర జెండాల ఆవిష్కరణ
- ప్రభుత్వ విధానాలపై నిరసన

నెల్లూరు (వైద్యం), మే 1 : ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) సంబరాలు బుధవారం నగరంలో జరిగాయి. వామపక్ష నేతలు ఎర్రజెండాలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ జెండాలను జలకన్య బొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ ఆటోస్టాండ్, పడుగుపాడు గూడ్స్ హెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్, పప్పులవీధి, పల్లిపాడు ఆటో స్టాండ్ తదితర ప్రాంతాల్లో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. రాజేంద్రనగర్ వెహికల్ షెడ్ వద్ద సీపీఎం నేత చంద్రారెడ్డి, కోటమిట్టలో శ్రీనివాసులు, పూలే బొమ్మ ఆటోస్టాండ్ వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ జెండాలను ఎగుర వేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్న తరుణంలో అమెరికాలోని చికాగోలో కార్మికులు పెద్దఎత్తున నిరసనకు దిగారన్నారు. ఈ నేపథ్యంలో ఏడుగురు మరణించారని, దీంతో యాజమాన్యాలు, ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికుల సమస్యలు పరిష్కరించాయని వివరించారు. కానీ, మన దేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను రూపొందించారని ధ్వజమెత్తారు. సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూలం ప్రసాద్, అంకయ్య, రవి, నాగూర్, శరత్, సుధాకర్, సుబ్బారెడ్డి, రమేష్, వేణు, రత్నం తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : కార్మిక జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రూరల్లో కార్మిక దినోత్సవం

నెల్లూరు రూరల్ : కార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల్లో సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. కొత్తవెల్లంటిలో సీపీఐ నేత పముజుల దశరథ రామయ్య పార్టీ జెండాను ఆవిష్కరించి, అమరులకు ఘన నివాళి అర్పించారు. భూ పోరాటాల నేత సోము అనంతరెడ్డి ఉద్యమాలను నెమరు వేసుకున్న నాయకులు ఆయన సమాధి వద్ద మేడే నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కాగా, కమ్యూనిస్ట్ నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని పురస్కరించుకుని సీపీఎం నాయకులు వాడవాడలా ఎర్ర జెండాలను ఎగురవేశారు. సౌత్‌మోపూరు, ములుముడి, వెల్లంటి, దేవరపాళెం, పొట్టేపాళెం, మాదరాజుగూడూరు గ్రామాల్లో పుచ్చలపల్లి సేవలను నాయకులు కొనియాడారు. ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, అల్లాడి గోపాల్, ముత్యాల నాగయ్య, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధే నారాయణ, వీపీఆర్ ధ్యేయం

ఎన్నికల ప్రచారంలో పొంగూరు రమాదేవి

నెల్లూరు (విద్య), మే 1 : నెల్లూరు నగరాభివృద్ధే పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. బుధవారం నగరంలోని 13వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇంటి పెద్ద దిక్కు కోల్పోతే చంద్రన్న బీమా పథకం ద్వారా ఆర్థిక సాయం అందచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర కష్టాలకు గురయ్యారన్నారు. తాము ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఈ సమస్యలను తెలియచేస్తూ బాధను వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రానున్న కూటమి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేసేలా మహిళా శక్తి ప్రణాళిక, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి ఎన్నో పథకాలను అమలు చేయనున్నారన్నారు. మహిళా సాధికారితే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి అండగా ఉండి ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వీపీఆర్‌ను గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారంలో బాలికతో రమాదేవి



కరపత్రమిచ్చి ఓటు అర్థిస్తున్న పొంగూరు సింధూర

- జగన్ ప్రభుత్వం మాయమాటలు చెపుతూ నిరుపేదలను పూర్తిగా విస్మరించిందని నారాయణ కుమార్తె పొంగూరు శరణి విమర్శించారు. నగరంలోని 9వ డివిజన్‌లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చని జగన్ సర్కారుతో ప్రజలు విసిగిపోయారని, వైసీపీ నేతల కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది ఒక్క తెలుగుదేశం పార్టీయేనన్నాను. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో నగర ఎమ్మెల్యేగా నారాయణను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
- సూపర్‌సిక్స్ పథకాలతో చంద్రబాబు నాయుడు మ్యాచ్ గెలిచారని, తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోతో ఫైనల్స్ విజయం సాధించడం తథ్యమని నారాయణ కుమార్తె డాక్టర్ పొంగూరు సింధూర తెలిపారు. నగరంలోని 44వ డివిజన్‌లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు టీడీపీతో న్యాయం జరుగుతుందని, పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. టీడీపీకి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసి ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వీపీఆర్‌ను గెలిపించాలని కోరారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి : సోమిరెడ్డి

నెల్లూరు (వీఆర్సీ), మే 1 : ముదిరాజ్‌ల అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ తరపున సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ముదిరాజ్ సంఘీయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సోమిరెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ కుల సంఘం తనకు మద్దతు తెలుపడం ఆనందంగా ఉందన్నారు. రఘురామ్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేయగా వాటికి నిధులు, విధులు లేకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గంపల అనిల్‌కుమార్, నగర అధ్యక్షుడు జీ చెంచయ్య, కనకట్ల నరసింహా ముదిరాజ్, జయకుమార్, అగ్రహారం సర్పంచ్ కవిత, గోపాలయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి రామానుజుల తిరునక్షత్ర ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 1 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న భగవద్రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 11వతేదీ వరకు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్, ఈవో డీ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9గంటలకు తిరుమంజనం, సాయంత్రం 4.30 గంటలకు మంగళశాసనోత్సవం అనంతరం పేట ఉత్సవం జరుగుతాయని తెలిపారు. 10, 11 తేదీల్లో ఉదయం 7.30గంటలకు పేట ఉత్సవం, 9గంటలకు తిరుమంజనం సేవలు జరుగుతాయని తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.



లోకేష్‌తో సతీష్ వేమన భేటీ

నెల్లూరు(హరనాథపురం), మే 1 : తెలుగుదేశం పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిశీలకుడిగా ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్ వేమనను అధిష్ఠానం నియమించింది. బుధవారం నెల్లూరు వచ్చిన పార్టీ నేత లోకేష్‌ను సతీష్ కలిశారు.

టీడీపీ ఓటింగ్‌ను అడ్డుకునేందుకు వైసీపీ కుట్ర

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం

నెల్లూరు (వైద్యం), మే 1 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఓటింగ్‌ను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు దిగుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి విమర్శించారు. నగరంలోని యువగళం సైట్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ నేతల దాడులు, ప్రకటనలపై పోలీసులు, ఎన్నికల సంఘం ఏమి స్పందిస్తున్నారని ప్రశ్నించారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రచార సభలో మాట్లాడుతూ వైసీపీకి ఓటు వెయ్యకపోతే టీడీపీ నేతలు ఊళ్లలో తిరగలేరని బెదిరించడం దుర్మార్గమన్నారు. మేకపాటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుంగనూరులో సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉన్నా వైసీపీ మూకలు దాడులు చేసి వాహనాలు తగుల బెట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మద్యం భారీఎత్తున పట్టుబడిందంటే అది ఎలా వచ్చిందో తెలుస్తోందన్నారు. బేవరేజస్ చైర్మన్ వాసుదేవరెడ్డి మద్యం డంపింగ్ చేయడంలో కీలక పాత్ర పోషించారని విమర్శించారు. గోవా నుంచి మద్యం తెప్పిస్తున్నారని, అది తాగితే ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు. నెల్లూరు నగరంలో ఎంతో అభివృద్ధి చేశామని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెబుతున్నారని, కలెక్టరేట్, నిప్పో ఫ్యాక్టరీ కూడా కట్టించింది ఆయనేనని ఎద్దేవా చేశారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎల్‌సీఆర్

నెల్లూరు (విద్య): టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఎల్‌సీ రమణారెడ్డి నియమితులయ్యారు. జిల్లాలో విద్యాశాఖాధికారిగా పనిచేసిన ఆయన గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీ చేశారు. తెలుగుదేశం పార్టీలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. దీంతో ఎల్‌సీఆర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

సేవ చేయని వారికి ఓటెందుకు?

టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి





ప్రజలకు అభివాదం చేస్తున్న రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి , లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 1 : ప్రజలకు సేవ చెయ్యని, నియోజకవర్గంలో అందుబాటులో ఉండని వైసీపీ అభ్యర్థులకు ఓట్లు ఎందుకు వేయాలని టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం 32వ డివిజన్‌లోని ఎన్‌సీసీకాలనీ, ఎన్‌టీటీ కాలనీ, వెంగళరావునగర్, సంజయ్‌గాంధీ నగర్, ఇందిరా నగర్‌లో ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి ప్రజలను భయపెడుతున్న రోజుల్లో నియోజకవర్గానికి అండగా నిలవాల్సిన వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కనీసం ప్రజలను ఫోన్లో కూడా పలకరించకుండా హైదరాబాద్‌లో ఉండిపోయాడని దుయ్యబట్టారు. ఇప్పుడు తగుదన్నమ్మ అంటూ ఓట్లు వెయ్యమని ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకుని వెళతారని నిలదీశారు. తనతోపాటు తన కుటుంబ సభ్యులకు మూడు సార్లు కరోనా సోకినా లెక్క చేయక నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు వైద్య సేవలు అందించానని తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన ఆదాల, విజయసాయిరెడ్డికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు రూరల్ నియోజకవర్గ సమస్యలపై పోరాడితే వీళ్లు కనీస మద్దతు ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రజా రంజక పాలన అందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని కోరారు. కాగా, 31వ డివిజన్ శ్రీలంక కాలనీకి చెందిన సూర్య, ప్రవీణ్, ఫ్రాన్సిస్, గుణల మిత్రబృందాన్ని శ్రీధర్‌రెడ్డి నెల్లూరులోని తన కార్యాలయంలో కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. నెల్లూరుకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారతీరును వివరించారు.

మైనార్టీల మద్దతు వీపీఆర్, నారాయణకే : వినోద్‌రెడ్డి



నెల్లూరు (విద్య) : నగరంలో మైనార్టీలందరూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణకే మద్దతు తెలియచేయడం ఆనందంగా ఉందని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతుగా బుధవారం ఆయన 42వ డివిజన్‌లో ప్రచారం చేశారు. నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా మైనార్టీలందరూ తమకే మద్దతు తెలియచేస్తూ ఆదరిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా చూపించి వీపీఆర్, నారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతికి సంజయ్ కృషి


నెల్లూరు(హరనాథపురం) : జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతికి సబ్‌రిజిస్ట్రార్ ఎండేటి సంజయ్ కుమార్ ఎంతగానో కృషి చేశారని ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం ఓ కల్యాణ మండపంలో సంజయ్‌కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన సభ జరిగింది. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

నగలు, నగదు బ్యాగ్ అప్పగింత

నెల్లూరు(క్రైం). మే 1: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు సాంకేతికత ఆధారంగా గుర్తించి బాధితులకు అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... కలువాయికి చెందిన చల్లా లలితమ్మ ఇటీవల నెల్లూరులోని హరనాథపురంలో ఉంటున్న కుమారుడు మల్లికార్జునరెడ్డి ఇంటికి వచ్చారు. బుధవారం స్వగ్రామానికి ఆటోలో ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. అప్పటికే బస్సు కదులుతుండటంతో హడావిడిగా ఆటో నుంచి దిగి బస్సు ఎక్కారు. అయితే ఆటోలో ఓ బ్యాగును మరిచిపోయారు. అందులో నగలు, నగదు ఉన్నాయి. బస్సు ఎక్కిన తర్వాత బ్యాగు విషయం లలితమ్మకు గుర్తురావడంతో కుమారుడికి ఫోన్‌లో సమాచారమిచ్చింది. ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. సాంకేతికత ఆధారంగా లలితమ్మ ప్రయాణించిన ఆటోను గుర్తించారు. గాంధీబొమ్మ వద్ద ఆటోను ఆపి అందులోని బ్యాగ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇన్‌స్పెక్టర్ బాధితులకు బ్యాగ్ అప్పగించారు.

తల్లిపై కుమారుడి హత్యాయత్నం

నెల్లూరు(క్రైం) : మద్యం సేవించేందుకు నగదు ఇవ్వలేదని తల్లిపై కుమారుడు హత్యకు యత్నించాడు. పుట్టాఎస్టేట్ కు చెందిన ఇందిర తన చిన్నకుమారుడు హరితో కలిసి నివసిస్తోంది. గత నెల 29వ తేదీ రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లి గిరి అడిగాడు. తన వద్ద లేవని చెప్పడంతో కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు గిరి ఘటనా స్థలానికి చేరుకుని తల్లిని జీజీహెచ్‌కు అక్కడి నుంచి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ హత్యాయత్నం కేసు నమోదు చేశారు.




● స్టేషన్‌లోనే వివాహితపై దాడి
● హెడ్ కానిస్టేబుల్‌పై వీరంగం

రెచ్చిపోయిన రౌడీ పోలీస్!

● వలంటీర్ ఆత్మహత్య కేసులో జైలుకెళ్లిన నేపథ్యం
● పలుకుబడితో అదే స్టేషన్‌లో తిరిగి కానిస్టేబుల్‌గా నియామకం

శ్రీకాళహస్తి, మే 1: శ్రీకాళహస్తిలో ఓ పోలీసు రెచ్చిపోయాడు. అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లో ఓ వివాహితపై దాడికి పాల్పడ్డాడు.అడ్డుకోబోయిన హెడ్ కానిస్టేబుల్‌పై వీరంగం చేశాడు. పోలీసుశాఖలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటన పూర్వాపరాలివి.... శ్రీకాళహస్తి సన్నిధివీధి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పట్టణంలోని ఓ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేసేవాడు.స్టేషన్ తరపున ముక్కంటి ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు చేయించేవాడు. పలుకుబడితో స్థానికంగా ఏళ్ల తరబడి పాతుకుపోయాడు.వివాహమై ఇద్దరు పిల్లలున్నప్పటికీ కొందరు యువతులతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో ఒక వలంటీర్‌తో చనువు ఏర్పడింది.అలాగే ఓ వివాహితతో సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ తన తండ్రితో వెళ్లి పెళ్లి చేసుకోమంటూ ప్రాధేయపడింది. ఆ సమయంలో కానిస్టేబుల్, ఆయన కుటుంబ సభ్యులు కలిసి తండ్రి ఎదుటే తనను దారుణంగా అవమానించారంటూ రెండు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టి ఉరేసుకుని చనిపోయింది. ఆ లేఖ ఆధారంగా ఆ కానిస్టేబుల్‌తో పాటు అతడితో సన్నిహితంగా వివాహితపై కేసు నమోదు చేశారు.ఇద్దరికీ రిమాండ్ విధించడంతో జైలుపాలయ్యారు. దీంతో కానిస్టేబుల్ కొంతకాలం సస్పెండయ్యారు.కొద్ది నెలల క్రితం అజ్ఞాతం నుంచి బయటపడ్డ అతడు మళ్లీ అదే స్టేషన్లో కానిస్టేబుల్‌గా చేరాడు.మద్యం మత్తులో మంగళవారం రాత్రి తనకు సన్నిహితురాలైన వివాహితకు ఫోన్ చేసి శ్రీరామ్ నగర్ కాలనీలోని ఆమె ఇంటివద్దకు వెళ్లాడు.ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె నేరుగా స్టేషన్‌కి వెళ్లి కానిస్టేబుల్ తీరును వివరించింది.అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించాడు.ఆమెను వెంబడిస్తూ కారులో స్టేషన్‌కు చేరుకున్న కానిస్టేబుల్ అది గమనించి రెచ్చిపోయాడు. నా మీదే కంప్లైంట్ రాసివ్వమంటావా అంటూ హెడ్ కానిస్టేబుల్‌ను బూతులు తిట్టాడు. అక్కడే కుర్చీలో కూర్చుని ఉన్న వివాహితపై దాడికి తెగబడ్డాడు.దీంతో ఆమె విలపిస్తూ ఇంటిబాట పట్టింది.ఈ ఘటనపై సీఐకి లిఖితపూర్వకంగా హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశారు.



శృతి మించిన లోకలిజం...!

శ్రీకాళహస్తి పోలీస్ శాఖలో లోకలిజం శృతి మించిపోతోంది. నిబంధనల ప్రకారం స్థానికంగా పోలీసులకు విధులు కేటాయించకూడదు.ఒకవేళ కేటాయించినా కాలపరిమితి ముగిసిన తర్వాత తప్పనిసరిగా బదిలీ చేయాలి.ఇందులో ఏ ఒక్క నిబంధన కూడా శ్రీకాళహస్తిలో చాలామందికి అమలు కావడం లేదు. ఇలా పాతుకుపోయిన వారిలో చాలామంది చట్ట వ్యతిరేక వ్యాపారాల్లో భాగస్వాములయ్యారన్న ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి.ఆర్థికంగా బలవంతులైపోయి ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదు. కొన్ని సందర్భాల్లో అధికారులపై తిరగబడి దుర్భాషలాడిన ఘటనలు కూడా జరిగాయి. ఇంత జరుగుతున్నా ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని ఎవరూ కదపడం లేదు. కాబట్టే స్టేషన్లోనే హెడ్ కానిస్టేబుల్‌పై కానిస్టేబుల్ రెచ్చిపోయే పరిస్థితి వచ్చింది. ఇకనైనా అధికారులు రక్షకభటుల ప్రక్షాళనపై దృష్టి సారించాల్సి వుంది.

ఎన్నికల వేళ......

రూ. 7 లక్షల మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యం కేసులను పరిశీలిస్తున్న సెబ్ అధికారులు

తడ, మే 1 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దొంగచాటుగా రవాణా అవుతున్న పుదుచ్చేరి మద్యాన్ని భీములవారిపాళెం చెక్‌పోస్టులో సెబ్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం పుదుచ్చేరి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ చేపల లారీని ఆపిన సెబ్ అధికారులు తనిఖీ చేశారు. లారీలో చేపలను లోడ్ చేసుకొని వెళ్లే ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలు పేర్చి ఉండటంతో అనుమానం వచ్చి కిందకు దింపారు. వాటి వెనుక మద్యం కేసులను గుర్తించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీలో రూ.7.40 లక్షల విలువైన సుమారు 300 కేసులు (14,400 క్వార్టర్ బాటిళ్లు) మద్యాన్ని గుర్తించారు.పట్టుబడ్డ డ్రైవర్ కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాకు చెందిన మహ్మద్ ఫిరోజ్‌గా గుర్తించారు. విచారణలో పుదుచ్చేరిలోని గ్లోబల్ బేవరేజస్ నుంచి ఈ మద్యాన్ని తరలిస్తున్నట్లు తేలింది.నెల్లూరులోని ఓ ఐస్ ఫ్యాక్టరీ వద్దకు లారీని తీసుకెళితే అక్కడకు సంబంధిత వ్యక్తులు వచ్చి మద్యాన్ని మరో చోటకు తీసుకువెళతారని డ్రైవర్ చెప్పినట్లుగా తెలిసింది. అయితే డ్రైవర్ వద్ద ఉన్న ఫోన్ నెంబర్లను బట్టి విచారించగా లారీని సింగరాయకొండకు తీసుకువెళ్తున్నట్లు తేలింది.ఈ మద్యం కంపెనీలో మంగళవారమే తయారుచేసి వెంటనే రవాణా చేస్తున్నట్లు సమాచారం. అధికారుల దర్యాప్తులో ఈ మద్యాన్ని ఏ పార్టీ తరలిస్తోందో బయట పడే అవకాశం వుంది.





పాత పంచాయతీ భవనం - పాత పంచాయతీ భవనంలో దాచిపెట్టిన మద్యం బాటిళ్లు

పాత పంచాయతీ భవనంలో మూడు మద్యం కేసుల స్వాధీనం

● వైసీపీ దాచిపెట్టిందన్న టీడీపీ ఫిర్యాదుతో వెలుగులోకి


చంద్రగిరి, మే 1: చంద్రగిరి మండలం ఐతేపల్లె పాత పంచాయతీ భవనంలో మూడు మద్యం కేసులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పులిత్తివారిపల్లెలో పాత పంచాయతీ భవనం నిరుపయోగంగా వుండడంతో డీలర్ రేవతి అందులో ఓ గది తీసుకుని గ్రామానికి రేషన్ పంపిణీ చేస్తున్నారు. మరో గది తాళాలు పంచాయతీ కార్యదర్శి చంద్రబాబు.. ఐతేపల్లె సర్పంచ్ ఫజల్లా భర్త అంజాన్ ఖాన్‌కు ఇచ్చారు. అయితే పాత పంచాయతీ భవనంలో మద్యం కేసులను వైసీపీ నాయకులు దాచిపెడుతున్నారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులొచ్చి సర్పంచ్ భర్త వద్ద ఉన్న తాళాలు అడిగారు. తాళాలు తనవద్దలేవని, వైసీపీ కార్యకర్త నాగరాజుకు ఇచ్చినట్లు తెలిపారు. నాగరాజు అందుబాటులో లేకపోవడంతో పోలీసుల సాయంతో తాళాలను పగలగొట్టి తనిఖీ చేశారు. మూడు మద్యం కేసులను గుర్తించారు. అందులో 144 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నాయి. ప్రభుత్వ భవనంలో అక్రమంగా మద్యం దాచి పెట్టడాన్ని టీడీపీ నాయకులు చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి నిశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే.. వైసీపీ సర్పంచ్ భర్త ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలకు ఇవ్వడానికి మద్యం దాచిపెట్టినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పాకాల ఎక్సైజ్ సీఐ శ్రీహరి రెడ్డి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరు దాచిపెట్టారో దర్యాప్తులో తేలాక వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు.

అపార్టుమెంటులో చీరలు,నగదు సీజ్

తిరుపతి(నేరవిభాగం) మే 1 : ఓటర్లకు పంపిణీ చేసేందుకు దాచిపెట్టిన రూ.23 వేల విలువ చేసే 46 చీరలను, రూ 1.22 లక్షల నగదును బుధవారం తిరుపతి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యూనివర్సిటీ సీఐ మురళీకృష్ణ కథనం మేరకు..తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని మిథిన్ అపార్టుమెంటులో కాపురమున్న సురేష్‌బాబు ఇంటిలో చీరలు, నగదు దాచి వుంచారని సమాచారం అందింది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అపార్టుమెంటులో తనిఖీలు చేసి 46 చీరలను, రూ.1.22 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.అపార్టుమెంట్ యజమాని సురేష్‌బాబుతో పాటు విజయకుమార్, సత్యవతి అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



సీజ్ చేసిన చీరలు, నగదు



నిప్పుల కుంపటి

● ఎండల దెబ్బకు మాడిపోతున్న జనం
● సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తిల్లో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత
● 20 మండలాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
● అత్యల్పం 36.8 డిగ్రీలు



ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న తిరుచానూరు బైపాస్ రోడ్డు

తిరుపతి(కలెక్టరేట్), మే 1: జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఉదయం 7గంటలకే భానుడు సెగలు పుట్టిస్తుండడంతో బయటకు రావాలంటే జనం బెంబేలెత్తుతున్నారు.నాలుగు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటడం గమనార్హం.రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.రానున్న మూడురోజులు వడగాడ్పులు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. బుధవారం గరిష్టంగా శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేటల్లో 45.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా 20 మండలాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.నాయుడుపేట మండలంలో 45.8డిగ్రీలు, డక్కిలి, తొట్టంబేడుల్లో 44.8, ఏర్పేడులో 44.6, వెంకటగిరి,కేవీబీపురం,డీవీసత్రం మండలాల్లో 44.3,తిరుపతి రూరల్, నాగలాపురం మండలాల్లో 44, ఎర్రావారిపాళెం, చిట్టమూరుల్లో 43.7,రేణిగుంటలో 43.3, ఆర్‌సీపురం మండలంలో 43.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోట, వాకాడు, బాలాయపల్లె మినహా మిగిలిన మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం.గురువారం కూడా ఇదే విధంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

53,206 పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), మే 1:సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి బుధవారం 53,206మందికి పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో 2,70,394మంది పింఛను దారులుండగా 2,10,872మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని,వారంతా గురువారం డ్రా చేసుకోవచ్చని సూచించారు. మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీబీటీ ఫెయిల్ అయిన వారికి కూడా నేటి నుంచి ఇంటి వద్దకే పింఛన్లు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని బుధవారం తిరుపతి రూరల్, ఆర్‌సీపురం, వడమాలపేట మండలాల్లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు.

కేంద్ర బలగాలు వచ్చేశాయ్

శ్రీకాళహస్తి, చంద్రగిరి, గూడూరులకు కేటాయింపు



తిరుపతి(నేరవిభాగం), మే 1: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలకు కేంద్ర బలగాలను మొహరించింది. ఇప్పటికే తిరుపతికి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు మూడు కంపెనీలు అంటే దాదాపు 240 మంది నెల కిందటే చేరుకున్నారు. వారు అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ చేస్తూ మేమున్నామని ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. రోజు రోజుకూ కొన్ని నియోజకవర్గాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తడం, ప్రచారాల్లో ఘర్షణ నెలకొనడం, ఇరు పార్టీలూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసుకోవడంతో జిల్లాకు మరిన్ని కేంద్ర బలగాలు వచ్చాయి. రెండ్రోజుల కిందట అండమాన్ నికోబార్ దీవుల నుంచి సీఆర్పీఎఫ్ బలగాలు మూడు కంపెనీలు అంటే 225 మంది తిరుపతికి చేరుకున్నారు. వీరితోపాటు సీఐఎస్ఎఫ్ బలగాలు మరో మూడు కంపెనీలు అంటే దాదాపు 230 మంది జిల్లాకు వచ్చారు. వీరంతా శాంతి భద్రతల విషయమై సంబంధిత అధికారులతో సమావేశం అవుతున్నారు. ఆ తర్వాత వీరిని జిల్లాలో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలైన గూడూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు పంపనున్నారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గాల్లో ఎలాంటి వాతావరణం ఉంది.. ఘర్షణలు, విధ్వంసాలు, దాడులు, పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఈవీఎంలు అపహరించడం వంటి ఘటనలు ఎక్కడ జరిగే అవకాశం ఉందన్న వివరాలు తెలుసుకుంటున్నారు. మరోవైపు గత ఎన్నికల్లో ఎలాంటి కేసులు నమోదయ్యాయి అన్న కోణంలోనూ ఆరా తీస్తున్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో ఈ మూడు నియోజకవర్గాల్లో కేంద్ర బలగాలు భారీ ఎత్తున మొహరించనున్నారు. ఆ తర్వాత ప్రతి పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా తనిఖీ చేస్తారు.

చంద్రగిరిలో నేడు హలో లోకేశ్

చంద్రగిరి, మే 1: చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలంలో గురువారం హలో లోకేశ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విచ్చేయనున్నారు. ఈసందర్భంగా చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సభా స్థలాన్ని బుధవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి సుమారు పది వేల మంది యువత హాజరుకానున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యావ్యవస్థను తీర్చిదిద్దంపై, ఉద్యోగాల కల్పనకు కృషిపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. యువతీయువకులు భారీ స్థాయిలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని నానీ పిలుపునిచ్చారు.





అగరాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని - చదును చేస్తున్న సభా స్థలం

ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), మే 1: పుట్టుకతో అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఎనిమిదేళ్ల చిన్నారికి శస్త్ర చికిత్స చేసి, ప్రాణాలను నిలబెట్టామని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. రుయా చిన్నపిల్లల విభాగంలో బుధవారం మీడియాకు వివరాలు తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం దళవాయిపల్లెకి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి హిమశ్రీకి పుట్టినప్పటి నుంచి కాళ్లకు, పొట్ట కింద భాగానికి రక్త సరఫరా వ్యతిరేక దిశలో జరుగుతుంది. దీంతో బాలిక పొట్ట నుంచి కాళ్ల వరకు శరీరం అంతా పచ్చని రంగులోకి మారి ప్రమాదకరంగా తయారైంది. ఈ సమస్యతో చిన్నారి సరిగ్గా నడిచే పరిస్థితి కూడా లేకపోయింది. పలు ఆస్పత్రుల్లో చూపించినా, దీనికి చికిత్స లేదని చెప్పడంతో వారం కిందట రుయా చిన్నపిల్లల విభాగానికి బాలికను ఆమె తల్లి సుశీల తీసుకొచ్చింది. కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రమ పరీక్షించి బాలిక లార్జ్ ఆర్టిరియో వీనస్ మాల్ ఫార్మేషన్ ఆఫ్ బై లెటర్ లోయర్ లింబ్స్, అబ్డామిన్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డాక్టర్ రాధా సాయంతో అధునాతన పద్ధతిలో చిన్నారికి నాన్ ఇన్వేసు రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ అనే టెక్నిక్‌తో కోత, కుట్లు లేకుండా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం చిన్నారి పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తుందని రవిప్రభు తెలిపారు. ఇటీవల రుయాస్పత్రిలో చేస్తున్న అరుదైన శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాలు పత్రికల్లో చూసి వీరు ఇక్కడకు వచ్చారన్నారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, క్లినికల్ పర్ఫ్యూజనిస్ట్ చిరంజీవి, నర్సింగ్ అధికారి రాధా తదితరులు పాల్గొన్నారు.



కోలుకున్న చిన్నారితో వైద్య బృందం

ఆంధ్రజ్యోతి జన కేతనం

గురువారం 2 మే 2024

వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాలోని సాగునీటి సంఘాలు నిర్వీర్యమయ్యాయి. అధికారంలోకి రావడంతోనే సాగునీటి సంఘాలను రద్దు చేసింది. సాగునీటి సంఘాలు నిర్వీర్యం కావడంతో ఈ ఐదేళ్ల కాలంలో ఒక పంట కాలువలో కూడా పూడికతీత చేపట్టలేదు. దీంతో పంట పొలాలకు నీరు పారక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. చివరకు రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత నిధులతో పూడికతీత చేపట్టారు.





అధ్వానంగా పంట కాలువ

- ఐదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థ
- పంట కాలువలు అధ్వానం
- కనీస నిర్వహణ కూడా కరువు
- సాగునీటికి ఆయకట్టుదారుల ఇబ్బందులు
- అన్నదాతలే స్వచ్ఛందంగా పూడికతీత

నీటి సంఘాలకు నీళ్లొదిలారు!

సంగం, మే 1 : జిల్లాలో 738 సాగునీటి సంఘాలు ఉండగా, ప్రతి ఐదేళ్లకోసారి వీటికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఒక్కో సంఘంలో అధ్యక్షుడితోపాటు ఐదుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వీరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనుమతితో ఇరిగేషన్ అధికారుల సమక్షంలో సంఘాలు పనిచేస్తాయి. పొలాల నుంచి రెవెన్యూ శాఖ వసూలు చేసే నీటి తీరువా పన్నుల ద్వారా నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో సాగునీటి సంఘాలు ఆయకట్టు పరిధిలోని అవసరమైన కాలువల్లో పూడికతీత చేపట్టేవారు. ప్రతి ఏటా సీజన్‌కు ముందు నిధుల కోసం ఎదురుచూడకుండా సంఘాల ఆధ్వర్యంలో పంట కాలువల్లో నామినేషన్ కింద పూడికతీత చేపట్టేవారు. తద్వార సాగునీటి కాలువలో సజావుగా నీరు పారడంతో పంటలు పుష్కలంగా పండేవి. నీటి తీరువా పన్ను వసూలు ఆలస్యమైనా ఆరు నెలలకో, ఏడాదికో మంజూరయినప్పుడు బిల్లులు తీసుకునేవారు.

● సాగునీటి సంఘాల రద్దు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో సాగునీటి సంఘాలను రద్దు చేసింది. వీటి బాధ్యతలను సంఘాల స్థాయిని బట్టి ఆయా ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని ఏఈ, డీఈ, ఈఈ, ఎస్‌ఈలకు అప్పగించారు. దీంతో కాలువల పూడికతీత బాధ్యత అధికారులపై పడింది. అంతేగాక రూ.లక్ష పైబడిన పనులకు టెండర్ విధానం తీసుకువచ్చారు. దీంతో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం యథావిధిగా జిల్లాలోని పంట కాలువల పూడికతీత పనులకు ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి టెండర్లను చేజిక్కించుకుని పనులు చేశారు. నిధులు విడుదల కాలేదు. ఈ క్రమంలో టీడీపీ హయాంలో చేసిన పనులకు సాగునీటి సంఘాలకు జిల్లాలో సుమారు రూ. 100 కోట్ల బకాయిలు ప్రభుత్వం ఇవ్వాలి. వాటిని విడుదల చేయకుండా ఆ సంఘాలను రద్దు చేశారు. దీంతో ఆ సంఘాల అధ్యక్షులు కోర్టును ఆశ్రయించారు. ఆ పనులకు అనుమతిచ్చిన జిల్లా కలెక్టర్‌ను బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో జిల్లా కలెక్టర్లకు సైతం సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత కాలువలకు పూడికతీతకు అనుమతి ఇవ్వక, ఇచ్చిన బిల్లులు రావని పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.


యంత్రం సహాయంతో రైతులే స్వచ్ఛందంగా పూడికతీస్తున్న పంట కాలువ

● పూడిపోయిన కాలువలు

జిల్లాలో ఇటు డెల్టా, నాన్‌డెల్టా (చెరువులు, బావులు) కింద సుమారు 8 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టులో వందలాది కాలువలు ఉన్నాయి. ఈ కాలువల్లో ఏటా పూడిక తీస్తేనే పొలాలకు సాగునీరు అందేది. లేకపోతే సాగునీరు పారుదల కష్టం. సాగునీటి సంఘాలు లేకపోవడం, నిధులు మంజూరు కాకపోవడంతో ఈ నాలుగేళ్ల పంట కాలువలో నాచు, గుర్రపుడెక్క తొలగించిన పాపాన పోలేదు. దీంతో సాగునీరు పారడం కష్టంగా మారింది.

● రైతులే స్వచ్ఛందంగా..

డెల్టాలో కొన్ని కాలువల్లో పూడికతీసే నాథుడే లేకపోవడంతో రైతులే చందాలు వేసుకుని పూడికతీత చేపట్టారు. ఇలాంటి పరిస్థితి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని అన్నదాతలు అంటున్నారు.

పంట కాలువలు అధ్వానం



తరుణవాయిలో నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. నాలుగేళ్లుగా పంట కాలువలు పూడికతీత చేపట్టక అధ్వానంగా తయారయ్యాయి. నీళ్ల పారక దిగుబడి తగ్గిపోయి నష్టాలు వచ్చాయి.

- తిప్పిరెడ్డి, ఏఎస్ కండ్రిక, సంగం

సొంత నిధులతో పూడికతీత



వైసీపీ పాలనలో పంట కాలువల్లో పూడిక తీయలేదు. అధికారుల చుట్టూ తిరిగాం. పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో రైతులంతా మాట్లాడుకుని చందాలు వేసుకుని కాలువల్లో పూడికలు తీసుకున్నాం.

- రమణారెడ్డి, రైతు, వెంకటేశ్వరపురం

అదీ సంగతి

స్కిల్ సెన్సెస్ అంటే ఏందన్నా..!



అన్నా... చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ రెండు రోజుల క్రితం విడుదల చేసిన మేనిఫెస్టో చూసావా..? చూసా తమ్ముడూ... దాంట్లో స్కిల్‌సెన్సెస్ చేపతామని చెప్పారన్నా... అంటే ఏందన్నా... అర్థం కావట్లే..? ఓ అదా తమ్ముడూ... స్కిల్‌సెన్సెస్ అంటే మనం ఇంతవరకు కులగణాంకాలు, మత గణాంకాలు చూసాం కదా.. అలానే అది నైపుణ్య గణాంకం... చంద్రబాబు విజనరీ కదా... ఆయన గొప్ప ఆలోచనతో ఇంతవరకు దేశంలోనేకాదు.. ప్రపంచంలోనే ఏదేశంలోనూ చేపట్టని విధంగా స్కిల్‌సెన్సెస్‌ను రాష్ట్రంలో చేపట్టనున్నారు. అంటే ప్రతి వ్యక్తికి ఏరంగంలో నైపుణ్యం ఉంది... ఏ రంగంలోనూ నైపుణ్యం లేకపోతే ఏ రంగంపై వారికి ఆసక్తి ఉంది... అని స్త్రీ, పురుషుల వద్ద నుంచి గణాంకాలు సేకరిస్తారు తమ్ముడూ... దీని వల్ల ఏం ఉపయోగం అన్నా... ఉంది తమ్ముడూ... ఏదైనా ఒక వ్యక్తి తనకు ఏదో ఒక రంగంలో నైపుణ్యం ఉండి, ఆ నైపుణ్యంతో ఆర్థికంగా ఎదగాలంటే పెట్టుబడి లేక తన నైపుణ్యాన్ని వృథా చేసుకుంటాడు. అలా కాకుండా ప్రభుత్వం తరుపున ఏరంగంలో అయితే ఓ వ్యక్తికి నైపుణ్యం ఉంటుందో దానికి తగ్గట్లు ప్రభుత్వం ఆసరా కల్పించి ఆ వ్యక్తి నైపుణ్యం వృథా కాకుండా చేయూతను అందిస్తుంది. దాంట్లో ఆర్థికంగా ఎదిగేలా చేస్తుంది. అయితే తమ్ముడూ ఈ స్కిల్స్ అనేవి పైచదువులు చదివిన వారికే కాదు.. కొద్దిగా చదువుకుని కార్పెంటర్‌గా, రాడ్‌బెండర్‌గా, భవననిర్మాణ కార్మికుడిగా, డ్రైవర్‌గా... ఇలా ఒక్కొక్కరికి ఒక్కో రకం నైపుణ్యం ఉంటుంది కదా..? అవన్నీ ప్రభుత్వం గణాంకాలు సేకరించడం ఈ స్కిల్‌సెన్సెస్ లక్ష్యం... ఓ అలాగా అన్నా ఈ స్కిల్‌సెన్సెస్ వల్ల ఇంత ఉపయోగం ఉందా... సూపర్ అన్నా... అన్నా... చంద్రబాబునాయుడు ఎట్టైనా తెలివైనోడన్నా... ఎప్పుడూ ఆయన మైండ్ సెట్ యువత తన కాళ్ల మీద తాను నిలబడి రాష్ట్రానికి ఎలా ఉపయోగపడతారనే దానిపైనే ఉంటుందన్నా... ఆయన విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రపంచంలో ఏ ప్రభుత్వం చేపట్టని స్కిల్‌సెన్సెస్‌ను చేపతామని చెప్పారన్నా.. సూపర్బ్ అన్నా.. చంద్రబాబా.. మజాకా ..!

- జలదంకి

● గతంలో మాస్ రాజకీయాలకు అడ్డా

● నేడు అభివృద్ధికి పట్టం

ముఖచిత్రం

హేమాహేమీల సెగ్మెంట్

నెల్లూరు సిటీ





నెల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం అంటే ఏసీ సుబ్బారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, పోలుబోయిన అనీల్‌కుమార్ వంటి మాస్ లీడర్లు గుర్తుకొస్తారు. వీరంతా ప్రజల మధ్యే తిరుగుతూ రాజకీయం చేసిన నాయకులు. నాడు మాస్ రాజకీయాలకు అడ్డాగా ఉన్న నగర నియోజకవర్గం నేడు అభివృద్ధికి పట్టం కడుతోంది.

ఇప్పుడు నెల్లూరు సిటీగా ఉన్న అసెంబ్లీ నియోజకర్గం 2009కు ముందు నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడ్డాక నెల్లూరును నెల్లూరు సిటీ అసెంబ్లీ సీటుగా మార్పు చేశారు. నెల్లూరు నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. 1952 నుంచి 1983 వరకు నెల్లూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా కొన సాగించింది. అప్పట్లో కాంగ్రెస్‌కు పోటీగా గట్టి రాజకీయ పార్టీలు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులే పోటీకి దిగేవారు. ఆ సమ యంలో ఆనం చెంచు సుబ్బారెడ్డి(ఏసీ సుబ్బారెడ్డి), ఆనం వెంకటరెడ్డి వంటి ఉద్దండులు నెల్లూరు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి నెల్లూరులో రాజకీయ ముఖచిత్రం మారి పోయింది. 1983లో టీడీపీ తరఫున ఆనం రామ నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 1989లో జక్కా కోదండరామిరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించారు. 1994లో తాళ్లపాక రమేష్‌రెడ్డి టీడీపీ తరపున విజయం సాధించి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో పనిచేశారు. 1999, 2004లలో జరిగిన ఎన్నికల్లో ఆనం వివేకానందరెడ్డి వరుసగా రెండుసార్లు గెలుపొందారు. అప్పుడే రాజకీయాల్లో ఆనం మార్క్ ఏర్పడింది.

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ
2019	పీ అనీల్‌కుమార్ యాదవ్	వైసీపీ
2014	పీ అనీల్‌కుమార్ యాదవ్	వైసీపీ
2009	ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి	పీఆర్‌పీ
2004	ఆనం వివేకానందరెడ్డి	కాంగ్రెస్
1999	ఆనం వివేకానందరెడ్డి	కాంగ్రెస్
1994	తాళ్లపాక రమేష్‌రెడ్డి	టీడీపీ
1989	జక్కా కోదండరామిరెడ్డి	ఇండిపెండెంట్
1985	కూనం వెంకటసుబ్బారెడి	కాంగ్రెస్
1983	ఆనం రామనారాయణరెడ్డి	టీడీపీ
1978	కూనం వెంకటసుబ్బారెడ్డి	కాంగ్రెస్
1972	ఆనం వెంకటరెడ్డి	కాంగ్రెస్
1967	ఎంఆర్ అన్నదాత	జనసంఘ్
1962	గంగా చిన కొండయ్య	కాంగ్రెస్
1955	ఆనం చెంచు సుబ్బారెడ్డి	కాంగ్రెస్

ఇక 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో నెల్లూరు సిటీగా రూపాంతరం చెందిన నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 2014, 2019 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్ గెలుపొందారు. ఆయన జగన్మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. 2014లో పొంగూరు నారాయణ సిటీ నుంచి పోటీ చేయకపోయినా మున్సిపల్ శాఖ మంత్రిగా ఆయన నెల్లూరు సిటీని సొంత నియోజకవర్గంగా ఎంచుకున్నారు. అలానే 2019లో నారాయణ సిటీ నుంచి పోటీ చేశారు. కాగా 1983 తర్వాత రెండు సార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ, ఓసారి పీఆర్పీ విజయం సాధించా యి. ప్రస్తుతం టీడీపీ నుంచి పొంగూరు నారాయణ, వైసీపీ నుంచి ఎండీ ఖలీల్ అహ్మద్‌లు పోటీ పడుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న పలువురు ఉద్దండ రాజకీయ నాయకులు నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడం విశేషం.

దుస్థితిలో ఉదయగిరి నియోజకవర్గ రోడ్లు

తట్టెడు మట్టి వేయని వైనం

నువ్వు నడిచిన దారే జగనన్నా..!

కొండాపురం, మే 1 : గత (2019) సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్మోహనరెడ్డి ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని కలిగిరి, కొండాపురం మండలాల పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేశారు. కలిగిరి మండలం తూర్పుగుడ్లదొన గ్రామం నుంచి 40 కిలోమీటర్ల దూరం జగన్ పాదయాత్ర చేశారు. జగన్ నడచిన ఈ రహదారిలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఉన్నాయి. ఆయన యాత్ర కొండాపురం మండలం శెట్టిపాలెంలోకి పాదయాత్ర ప్రవేశించి రాళ్లపాడు రిజర్వాయరు వరకు సుమారు 15 కిలోమీటర్ల దూరం సాగింది. ఆరోడ్డులో కూడా అప్పటికే చిన్నపాటి గుంతలు ఉండగా అవి నేడు పెద్ద గుంతలుగా మారాయి. గెలిచిన తర్వాత జగన్ ఈరోడ్డు సంగతే పూర్తిగా మరచిపోయాడు. ఈ విషయమై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


దెబ్బతిన్న కొండాపురం-కలిగిరి రోడ్డు మార్జిను


గుడవళ్లూరు గ్రామం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత


ఆదిమూర్తిపురం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

ఈసారి సెలవలన్నీ ఇంటికాడే !

రమేష్ : అరే... బావా.. ఈ సారి పిల్లల సెలవలకి ఎక్కడికి పోలేని పరిస్థితిరా... ఈ ఎలక్షన్లు కూడా ఇప్పుడే వచ్చాయి కర్మగాలి..

సాయి : పోన్లే రే మావా. ఖర్చంతా మిగిలిపోయిల్లా... ఎండలు తప్పించుకుంటివి. హాయిగా ఇంటికాడే ఉండు


రమేష్ : ఇంటిదగ్గర యాడ్రా ఉండేది. మన పార్టీవోళ్లు ఉంచుతుండ్రా... రోజు ప్రచారాలకి తీసుకోపోతుండ్రే...!

సాయి : పోకపోతే ఏంట్రామావా. పార్టీ అధికారంలోకి రావద్దా... రేపు అధికారంలోకి వస్తేనే కదా... మాన మాట సాగేది.

రమేష్ : అది నిజమే కానీ... పాపం పిల్లలు ఫీలైపోతున్నార్రా... సెలవలకు ఎక్కడికి తీసుకుపోవట్లేదని..

సాయి. : ఇంకెంతలే మావ బిర్రుగా 12 రోజులు. కళ్లమూసుకుని తెరిసేలోపు అయి పోతాయి. ఆ తరువాత నీ ఇష్టం..!

- నెల్లూరు రూరల్




తొలి బీసీ ఎమ్మెల్యే చెంచురామయ్య

తెలుసుకుందాం



నెల్లూరు జిల్లాలో వెనుకబడిన తరగతుల(బీసీల)కు చెందిన తొలి ఎమ్మెల్యేగా పొన్నెబోయిన చెంచురామయ్యయాదవ్ ఎంపికయ్యారు. ఆయన 1972-78 వరకు ఉదయగిరి శాసనసభ్యుడిగా పనిచేశారు. అప్పట్లో మాదాల తిమ్మయ్య(స్వతంత్ర), పొన్నెబోయిన చెంచురామయ్య యాదవ్(కాంగ్రెస్)లు పోటీ చేయగా తిమ్మయ్యకు 15,858 ఓట్లు రాగా, చెంచురామయ్యకు 30,082 ఓట్లు వచ్చాయి. 1975 ఫిబ్రవరి 24న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఉదయగిరి ప్రాంత సమస్యలపై గొంతెత్తారు. పేదలు అధికంగా ఉండే మా నియోజకవర్గ ప్రజలు రాగి సంగటి తింటున్నారని, వరి అన్నానికి నోచుకోలేదని ఆయన గళమెత్తారు. వారి బాధ నేను చూడలేకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారంతోనే పంటలు పండించే తన నియోజకవర్గంలో జలాశయం నిర్మిస్తే రైతులు వరి సాగు చేసి అన్నానికి నోచుకుంటారన్నారు. గండిపా లెంలో జలాశయ నిర్మాణానికి చర్యలు తీసుకోకపోతే ఇక తాను అసెంబ్లీలో అడుగుపెట్టనని భీష్మించారు. ఈ తరుణంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రూ.1.30 కోట్ల నిధులతో 1975 మండలంలోని గండిపాళెం జలాశయానికి శంకుస్థాపన చేశారు.

- ఉదయగిరి



త్తిరుపతిలో జోరుగా ప్రచారం సాగిస్తున్న అభ్యర్థులను, పార్టీల నాయకులను నిఘా నేత్రం ముచ్చెమటలు పట్టిస్తోంది. కాస్త హంగామాగా ఎక్కువ వాహనాలతో వెళ్దామన్నా ఎన్నికల అధికారులు ఏ మూల నుంచి చూసి లెక్కలు కడుతున్నారోననే భయం వెంటాడుతోంది. అభ్యర్థులు ఖర్చు పెట్టే ప్రతి రూపాయి లెక్క పెట్టేందుకు అధికారుల బృందం వీరిని ఇప్పటికే అనుసరిస్తోంది. ప్రతి కదలికను వీడియోలో బంధిస్తోంది. పోలీసు శాఖ కనుసన్నల్లో ఈ నిఘా సాగుతోంది. సభలు, సమావేశాలు, జనసమీకరణకు, లౌడ్ స్పీకర్లకు వెచ్చించే ఖర్చునూ వ్యయ పరిశీలకులు లెక్కిస్తున్నారు. ఖర్చు పరిమితి దాటితే ఎన్నిక చెల్లదంటూ ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం వుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు జాగ్రత్తలు పడుతున్నారు. మద్యం, సారా, బిర్యానీల లాంటివి పంపిణీ చేస్తున్నప్పుడు రెండో కంటికి తెలియకుండా జాగ్రత్త పడాలని పార్టీ అనుచరగణానికి నేతలు పదేపదే చెబుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

ప్రజల నుంచే నాయకులు పుట్టేవారు

● మా రోజుల్లో



నాకిప్పుడు 88 ఏళ్లు. చాలా కాలం నుంచి ఎలక్షన్లు చూస్తున్నాను. ఆనాటి రాజకీయాల్లో ఉన్న రాజనమే వేరు. నాయకులు ప్రజల్లో నుంచి పుట్టే వాళ్లు. సేవ చేసే తత్వం ప్రజలే గుర్తించి నాయకుడిగా వెంట నడుస్తూ ప్రోత్సహించేవారు. అసలు కొంతమంది నిజాయితీపరులైన నేతలు వారికి రాజకీయ మక్కువ లేకపోయినా జనాభిప్రాయం చూసి కాదనలేక ప్రజల బాగోగులను భుజానికి ఎత్తుకునేవారు. అది ఒక బాధ్యతగా పనిచేసే వాళ్ళు. మా రోజుల్లో ఇంతటి ప్రచార ఆర్భాటం ఉండేది కాదు. గ్రామాల్లో ఒక పెద్ద మనిషి ఎలా చెప్తే అలా మాటకు కట్టుబడి ఆ ప్రకారమే ఓట్లు వేసే వాళ్ళం. ఇప్పుడు పరిస్థితులు చూస్తే ఎవరి మాట ఎవరూ పట్టించుకోవడమే లేదు.

- బొక్కిసం పెద్ద మునెయ్య, వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

బాబు కోసం స్వదేశానికి..

● నేను సైతం..

గల్ఫ్‌లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన ఎన్ఆర్ఐ వడ్లమూడి సారథినాయుడు చంద్రబాబునాయుడుపై అభిమానంతో ఈ ఎన్నికలలో తన వంతుగా ప్రచారానికి వచ్చాడు. చంద్రగిరి మండలంలోని రవణప్పగారిపల్లెకు చెందిన ఈయన సౌదీ అరేబియాలో సిరామిక్ కంపెనీలో 20 ఏళ్ళుగా పనిచేస్తున్నాడు. టీడీపీ అన్నా, చంద్రబాబునాయుడు అన్నా వల్లమాలిన ప్రేమ. సౌదీ అరేబియాలో టీడీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్వదేశంలోని 2304 మందిని ప్రభావితం చేసేలా ఫోన్ కాల్స్ చేసినందుకు చంద్రబాబునాయుడు, లోకేష్‌ల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ సెలవు పెట్టి మరీ తాజాగా స్వస్థలం వచ్చాడు. నేను సైతం అంటూ రోజూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాడు.

- చంద్రగిరి




యువగళం పాదయాత్రలో లోకేష్‌తో సారథినాయుడు



తిరుచానూరు సమీపంలో స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

నాయకులకు మించిన నవరస నటనా సామ్రాట్టులు తెలుగునేలమీద లేరని నిరూపణ అవుతోంది. మొఖంలో అమాయకత్వాన్ని పులుముకుని ఎంతటి అబద్ధాలను అయినా బరితెగించి చెప్పేయచ్చని సీఎం జగన్‌రెడ్డిని చూస్తే అర్థం అవుతుంది. అందుకు ఇసుకే సాక్ష్యం. అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వంలో ఉచితం పేరుతో ఇసుకను దోచేశారంటూ నానా యాగీ చేసి, ప్రజలకు చవగ్గా కోరినంత ఇసుక అందించే విధానం అమలు చేస్తున్నామని ప్రకటించారు. నిజమేనేమో అని నమ్మిన జనాన్ని చూసి వైసీపీ నాయకులు నవ్వుకున్నారు. ఎక్కడికక్కడ రంగంలోకి దిగి ఇసుక తవ్వి నదులను గుల్ల చేశారు. శేషాచలం అడవుల్లో పుట్టి వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సముద్రంలో కలుస్తున్న స్వర్ణముఖి నదిని చూస్తే చాలు వైసీపీ ఇసుకదోపిడీ విశ్వరూపం కనిపిస్తుంది. తరాలుగా తిరుపతి జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చిన స్వర్ణముఖి.. జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లూ వైసీపీ నాయకుల అవినీతి దాహం తీర్చింది. ఈ ఐదేళ్లలోనే స్వర్ణముఖిని పిండి దాదాపు రూ.2000 కోట్ల ఇసుకను వీరు సొమ్ముచేసుకున్నారు.



ఇసుకాసురులకు మళ్లీ ఓట్లేద్దామా?

స్వర్ణముఖిని చెరబట్టారు!

ఐదేళ్లలో రూ. 2 వేల కోట్ల ఇసుక దోపిడీ

అన్నచాటు తమ్ముడి అక్రమార్జన రూ.160 కోట్లు

చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో అధికార పార్టీ ముఖ్యనేత తమ్ముడికి రోజువారీ కప్పం కడితేనే ఇసుక ట్రాక్టర్ కదులుతుంది. లేదంటే స్వర్ణముఖి నది గట్టు కూడా దాటక ముందే పోలీసులో లేక సెబ్ అధికారులో ప్రత్యక్షమవుతారు. ట్రాక్టర్ సీజ్ అవుతుంది. భారీగా జరిమానా పడుతుంది. చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిగారిపల్లి రీచ్ రెండు కంపెనీలకు కేటాయించినప్పటికీ వాటి పేరిట ఇసుక దందా నడుపుతున్నది తమ్ముడు గారేనన్నది బహిరంగ రహస్యం. చంద్రగిరి మండలంలో 60 ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రతి ట్రాక్టర్ ఆపరేటర్ రోజుకు రూ. 3 వేలు చెల్లిస్తేచాలు ఎన్ని ట్రిప్పులైనా తోలుకోవచ్చు. అంటే రోజుకు కప్పం రూ. 1.80 లక్షలు. ఐదేళ్ళలో రూ. 60 కోట్లకు పైగా వసూలు చేసుకునేశారు. ఇక తిరుపతి రూరల్‌లో 200 ఇసుక ట్రాక్టర్లున్నాయి. వీటి నుంచి తమ్ముడి గారి జేబులోకి రోజుకు రూ. 6 లక్షలు పడుతున్నాయి. లెక్కలు కడితే నెలకు రూ. 1.80 కోట్లు.. ఏడాదికి రూ. 21.60 కోట్లు.. ఐదేళ్లలో అన్నగారి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ్ముడు దోచుకుంది అక్షరాలా రూ. 108 కోట్లు. రెండు మండలాలూ కలిపితే చిన్నదొర అక్రమార్జన రూ. 160 కోట్ల పైమాటే! ఇది గాక చిన్నా చితకా నేతల దోపిడీ కూడా కలుపుకుంటే రెండు మండలాల్లో రూ. 500 కోట్ల విలువైన ఇసుక గల్లంతైంది.

కోటలో రూ. 210 కోట్ల ఇసుక మేసేశారు



కోట మండలం గూడలి వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాల జోరు

గూడూరు నియోజకవర్గం కోట మండలం గూడలి వద్ద స్వర్ణముఖిలో ఐదేళ్ళ నుంచీ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ 2022 ఫిబ్రవరి నుంచీ 2023 ఏప్రిల్ దాకా 14 నెలల పాటు ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగింది. రోజుకు 80 టిప్పర్లు, 50 ట్రాక్టర్ల లోడ్ల ఇసుక నది నుంచీ వెలికి తీశారు. ఆ లెక్కన 14 నెలల కాలలో అక్రమంగా తరలించిన ఇసుక విలువ రూ. 210 కోట్లకు పైగా వుంటుందని అంచనా. అందులో సగానికి పైగా అధికార పార్టీ నేతల జేబుల్లోకి చేరిందని సమాచారం.

టిప్పర్లను పట్టించినా అధికారులు వదిలేశారు

గూడూరు నియోజకవర్గం కోట మండలం గూడలి వద్ద అక్రమ ఇసుక తవ్వకాలతో విసిగిపోయిన గూడలి, దనుపాలెం, దక్షిణపొలం, తిన్నెలపూడి గ్రామాల ప్రజలు 2023 ఫిబ్రవరిలో తవ్వకాలను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు రంగప్రవేశం చేసి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిడితో తర్వాత వాటిని విడిచిపెట్టేశారు.



తొట్టంబేడు మండలం విరూపాక్షపురం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాల ధాటికి తాగునీటి పైపులైన్ బయటపడడంతో పాటు దెబ్బతిన్న దృశ్యం - ఏర్పేడు మండలం వికృతమాల వద్ద స్వర్ణముఖి నదిలో ఎంత లోతున ఇసుక తవ్వకాలు సాగించారనే దానికి నిదర్శనంగా గట్టుపై నిలిచిన చెట్టు

శ్రీకాళహస్తిలో రూ. 700 కోట్ల ఇసుక ఎత్తేశారు!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కూడబలుక్కుని గత ఐదేళ్ళ వ్యవధిలో (కొవిడ్ ఏడాది తప్ప) సుమారు రూ.700 కోట్ల విలువైన ఇసుకను స్వర్ణముఖి నది నుంచీ ఎత్తేసినట్లు అంచనా. రేణిగుంట మండలంలో అధికారిక రీచ్‌లు లేవు. అయితే కొత్రమంగళం నుంచీ జీపాలెం దాకా పది కిలోమీటర్ల పొడవునా స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ మండలంలో 200 ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నాయి. ఒక ట్రాక్టరు రోజుకు ఏడు ట్రిప్పులు తిరుగుతుంది. ప్రతి ట్రాక్టర్ ఆపరేటర్ రోజుకు రూ. 3 వేల చొప్పున ముడుపులు చెల్లించాలి. ఆ లెక్కన నాలుగేళ్ళ వ్యవధిలో రూ. 80 కోట్లకు పైగా ముడుపులు చెల్లించారు. ఇక్కడ అధికారిక రీచ్‌లు లేకపోయినా ఓ కంపెనీ పేరు చెప్పుకుని దాని పేరిట రశీదులిస్తూ కొందరు ముడుపులు వసూలు చేస్తున్నారు. వారు ఉమ్మడి జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న ఓ బడా నేత ప్రతినిధులు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడొకరి కుమారుడు బడా నేత తరపున వసూల్ రాజాగా వ్యవహరిస్తున్నారు. ఇక ఏర్పేడు మండలం పెనుమల్లం, పెనగడం, వికృతమాల, గోవిందవరం, మునగలపాలెం, కోబాక, కొత్త వీరాపురం, ముసలిపేడు, మడిబాక గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గ ముఖ్యనేత సన్నిహిత బంధువు ఈ దందా వెనుక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక్కడి నుంచీ టిప్పర్లలో చెన్నైకి ఇసుకను తరలిస్తున్నారు. ఈ మండలం నుంచీ అధికారపార్టీ నాయకులే రూ. వంద కోట్ల వరకూ వెనకేసుకున్నారన్న ప్రచారం వుంది. శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం, వేడాం, రామాపురం, చుక్కల నిడిగల్లు, పుల్లారెడ్డి కండ్రిగ, పట్టణ శివారులోని వాటర్ హౌస్ కాలనీ తదితర చోట్లా, అలాగే తొట్టంబేడు మండలం విరూపాక్షపురం, పెన్నలపాడు, చేమూరు, కనపర్తి తదితర చోట్లా స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గం మొత్తంలో దోచుకున్న ఇసుకలో స్థానిక నేత వాటా దాదాపు రూ.250 కోట్లు అని అంచనా. మిగతా సొమ్ము జిల్లా పెద్దలు దబాయించి కొట్టేశారని అంటున్నారు.

రౌడీషీట్ తెరిచారు!

రేణిగుంట మండలంలో రీచ్‌లు లేకపోయినా తొలుత ట్రాక్టరుకు రోజుకు రూ. వెయ్యి వసూలు చేశారు కొందరు అధికార పార్టీ నాయకులు. అయితే 2022 ఏప్రిల్‌లో ఆ మొత్తాన్ని హఠాత్తుగా రూ. 3 వేలకు పెంచేశారు. దీంతో ఒళ్ళు మండిన ట్రాక్టర్ ఆపరేటర్లు అదే నెల 13న మూకుమ్మడిగా గాజులమండ్యం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనలో బడా నేత ప్రతినిధుల ఒత్తిడితో పోలీసులు ట్రాక్టర్ ఆపరేటర్ల ఆందోళనకు నాయకత్వం వహించిన వ్యక్తిపై రౌడీషీట్ తెరిచారు.

ఇసుక గోతిలో పడి ఇద్దరు మృతి

రేణిగుంట మండలం జీపాలెం గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు భారీ ఎత్తున జరగడంతో అంతేస్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. 2022 ఆగస్టులో ఇద్దరు యువకులు నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ ఓ గోతిలో పడి మృతి చెందారు.

ఏర్పేడులో ఏడుగురిపై ఎదురు కేసు

ఏర్పేడు మండలంలో వైసీపీ ప్రభుత్వం రాగానే ఇసుక అక్రమ దందా మొదలైంది. 2019 సెప్టెంబరులో పెనుమల్లం గ్రామం వద్ద ఇసుక అక్రమ రవాణాను స్థానిక టీడీపీ నేత నిరంజన్ నాయుడు అడ్డుకున్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు తిరిగి ఆయన మీదే కేసుపెట్టారు.

చిట్టమూరులో ఛిద్రం చేశారు!



చిట్టమూరు మండలం మెట్టు వద్ద నిబంధనలను ఉల్లంఘించి రెండు మూడు రెట్లు లోతుగా ఇసుక తవ్వేసిన తీరును స్కేల్ పెట్టి మరీ చూపుతున్న గ్రామస్తులు

గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలతో స్వర్ణముఖి నది ఛిద్రమైంది. ఇక్కడ మెట్టు వద్ద అధికారిక రీచ్‌లో 13.85 ఎకరాల్లో తవ్వకాలకు జేపీ కంపెనీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ పరిధి దాటి తవ్వకాలు సాగించారు. మీటరు లోతుకి మించి తవ్వకూడదనే నిబంధన ఉన్నా 20 అడుగుల లోతు వరకూ తవ్వేశారు. రోజుకు సుమారు రూ. కోటి విలువైన ఇసుకను తరలించేశారు. ఆ లెక్కన 2023 జనవరి నుంచీ ఈ ఏడాది మార్చి వరకూ 15నెలల కాలంలో రూ. 450 కోట్ల విలువైన ఇసుక తవ్వి తీశారు. ఈ ఇసుకను స్థానికంగా విక్రయించకుండా చెన్నైకి తరలించి అధిక సొమ్ము చేసుకున్నారు. ఇష్టారాజ్యంగా జరిపిన ఈ తవ్వకాలతో మెట్టు వద్ద స్వర్ణముఖి నది భారీ గోతులతో అస్తవ్యస్తంగా తయారైంది.

పెళ్ళకూరులో 22 రోజుల్లో రూ. 20 కోట్లు స్వాహా

సూళ్ళూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కలవకూరు, పుల్లూరు, ముమ్మారెడ్డి గుంట, రావులపాడు, చిల్లకూరు గ్రామాల వద్ద స్వర్ణముఖిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వీరంతా స్థానికంగా విక్రయించేవారే. అయితే జయప్రకాష్ పవర్ వెంచర్స్ సంస్థ తాళ్వాయిపాడు వద్ద ఇసుక తవ్వకాలకు 2022 ఏప్రిల్‌లో అనుమతులు తెచ్చుకుంది. దీనిని గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడ తవ్వకాలు ఆపేసినా, అనుమతులులేని జీలపాటూరు-కప్పగుంట కండ్రిగ గ్రామాల నడుమ నదిలో తవ్వకాలు మొదలుపెట్టారు. రోడ్డుపై కాజ్‌వే నుంచీ మొదలుపెట్టి నదిలో కిలోమీటరు వరకూ తవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఇసుక తవ్వకాల కోసం ఏకంగా నదిలో అప్రోచ్ రోడ్డే నిర్మించేశారు. పలుసార్లు రెండు గ్రామాల రైతులు అడ్డుకున్నా పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులను వెళ్ళగొట్టారు. దీంతో విసిగిపోయిన జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్ రైతులతో కలసి హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేని చోట తవ్వకాలు జరపడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన హైకోర్టు తవ్వకాలు నిలిపివేయాల్సిందిగా ఆదేశించింది. ఈలోపు కేవలం 22 రోజుల వ్యవధిలోనే రూ. 20 కోట్లకు పైగా విలువైన ఇసుకను కొల్లగొట్టేశారు. రోజుకు 150 హెవీ టిప్పర్ లోడ్లు చెన్నైకి తరలించి సొమ్ము చేసుకున్నారు.

అన్నమేడులో నదిని కాపాడుకున్నారు

నాయుడుపేట మండలంలో తమకు అనుమతులు వున్నాయంటూ అన్నమేడు, మడపలం గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలకు రంగంలోకి దిగిన (చిత్తూరు జిల్లాలో చక్రం తిప్పే) ఓ మంత్రి అనుచరులకు రెండు గ్రామాల ప్రజలు చుక్కలు చూపించారు. స్థానిక సమస్య కావడంతో అధికార పార్టీ నాయకులతో సహా అన్ని పార్టీల వారూ ఒక్కటయ్యారు. మంత్రి అనుచరుల వాహనాలను కూడా గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. తమ ప్రాంత భూగర్భజలాల సంరక్షణకు ఉపయోగపడే స్వర్ణముఖి నదిలో ఇసుకను కాపాడుకున్నారు.



వాకాడు మండలం కాశీపురం, జాండ్రపేటల వద్ద హై టెక్నాలజీ వినియోగించి నీరున్నా ఇసుక తోడుతున్న దృశ్యం

వాకాడులో నీళ్లలోంచి ఇసుక తోడారు

గూడూరు నియోజకవర్గం వాకాడు మండలం కాశీపురం, జాండ్రపేటల వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు కొత్త ఒరవడి సృష్టించాయి. వెంకటగిరికి చెందిన వైసీపీ కీలక నేత చెన్నై నుంచీ పేరుమోసిన కాంట్రాక్టరును రంగంలోకి దించారు. ఆ కాంట్రాక్టరు రోజువారీ 50 లారీలు, 70 ట్రాక్టర్ల ఇసుకను చెన్నైకి తరలించారు. 2022 మార్చిలో మొదలైన అక్రమదందా అదే ఏడాది నవంబరు దాకా కొనసాగింది. ఆ నెలలో వర్షాలకు నదిలోకి నీరు చేరడంతో నెల పాటు పనులు ఆపేశారు. డిసెంబరులో నీరున్నప్పటికీ హై టెక్నాలజీ బోట్లు ఉపయోగించి 50 అడుగుల లోతు నుంచీ మోటర్లతో ఇసుకను వెలికి తీశారు. భూగర్భ జలాలు తగ్గుతున్నాయని ఆందోళనకు గురైన కొండాపురం, కాశీపురం, జాండ్రపేట గ్రామాల రైతులు 2023 మార్చిలో ఇసుక తవ్వకాలను అడుకున్నారు. అప్పటికే సుమారు రూ.120 కోట్ల విలువైన ఇసుకను చెన్నైకి తరలించేశారు.

వాటాలేసి పంచుకున్న బడా నేతలు

జిల్లాలో గత ఐదేళ్ళుగా అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న ఇసుక దోపిడీలో బడా నేతల ప్రమేయం వుంది. కడపకు చెందిన సీఎం సన్నిహిత బంధువు ఒకరు మొదలుకుని నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి దాకా పలువురు బలమైన నేతలు భారీగా లబ్ధి పొందినట్టు ప్రచారం జరిగింది. తవ్వకాలు జరిగే చోట, డంప్‌ల వద్ద, టిప్పర్లు, ట్రాక్టర్ల ఆపరేటర్ల వద్ద వసూళ్ళు చేసే చోట్ల వీరి సన్నిహిత అనుచరులు మకాం వేసి వుండడమే వారి ప్రమేయానికి నిదర్శనమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అక్రమార్జనలో వీరికి సింహభాగం పోనూ ఆయా నియోజకవర్గ ముఖ్యనేతలకు ఓ భాగం, తవ్వకాలు జరిగే మండల, గ్రామాల నేతలకు వారి వంతు వాటా దక్కుతున్నట్టు సమాచారం. మొత్తానికి ఎవరికీ సమాధానం చెప్పకుండా పోలీసు అండతో స్వర్ణముఖిలో ప్రకృతి ప్రసాదించిన ఇసుకను కొల్లగొట్టి అధికార పార్టీ నేతలు కోట్లకు పడగలెత్తిన వైనం జిల్లా ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది.

యువశక్తి బలాన్ని చూపించాలి



మాట్లాడుతున్న తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు

గూడూరు, మే 1: యువశక్తి బలమేందో 13వ తేదీ జరగనున్న ఎన్నికల్లో చూపించి ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించేలా, సైనికుల్లా పని చేయాలని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగుయువత ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ హామీని ఇచ్చి జగన్ దగా చేశారన్నారు. ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వడంతోపాటు 20 లక్షల ఉద్యోగాల రూపకల్పనకు రంగం సిద్ధం చేశారన్నారు. కరిముల్లా, పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, కృష్ణ, బి.ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్రకార్యదర్శిగా హరిచంద్రారెడ్డి



గూడూరు, మే 1: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా గూడూరుకు చెందిన కనుమూరు హరిచంద్రారెడ్డిని నియమిస్తూ మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. వైసీపీలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఉన్న హరిచంద్రారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి నెల్లూరులోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఇటీవల టీడీపీలోకి చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆయనకు పార్టీలో గౌరవం కల్పించేలా పదవిని ప్రకటించడంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు

పెళ్లకూరు, మే 1: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై బుధవారం అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. మండలంలోని బంగారంపేట, అర్థమాల పంచాయతీలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్.సునిల్, టి.పాపయ్య వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు రుజువుకావడంతో చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో అన్నపూర్ణారావు తెలిపారు.

మేత పోరంబోకు ఖాళీ చేయండి

- గిరిజనులకు అటవీ శాఖ అధికారుల ఆదేశం
- అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన బాధితులు

వెంకటగిరి టౌన్, మే 1: మేత పోరంబోకులో సాగు చేసుకుంటున్న తమపై అటవీశాఖ అధికారులు దాడి చేశారంటూ డక్కిలి మండలం నూరాయపాళెం, ఆల్తూరు పాడు, మోపూరు రోడ్డుకు చెందిన గిరిజనులు వెంకటగిరి అటవీశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోపూరు సర్వే నెం.1లో 1200 ఎకరాల్లో గతంలో తహసీల్దార్లు మేత పోరంబోకుగా గుర్తించారన్నారు. అందుతో తాము నిమ్మ చెట్లు సాగు చేసుకుంటున్నామని చెప్పారు. అయితే మంగళవారం సాయంత్రం ఉన్నట్టుండి అటవీశాఖ అధికారులు నోటీసు లిచ్చి భూమిని ఖాళీ చేయమన్నారని వాపోయారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తే ఖాళీ చేస్తామని చెప్పినా పట్టించుకోకుండా తమపై దాడికి పాల్పడ్డారన్నారు. ఇదే సర్వే నెంబరులో పలుగోడు గ్రామంలో కూడా 150 ఎకరాలు ఆక్రమణ చేసుకుని సాగుచేసుకుంటే వారిపై అటవీ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ధర్నాలో గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి.మల్లికార్జున్ రావు, మహిళా నాయకురాళ్లు ఉషా, ప్రభావతి, మల్లి సహా మూడు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.



ధర్నాలో గిరిజనులు

మద్యం అమ్ముకునే జగన్ మనకొద్దు

కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

నాయుడుపేట టౌన్, మే 1: మద్యం అమ్ముకునే సీఎం జగన్ రాష్ట్రానికి వద్దని కేంద్ర మాజీ మంత్రి, తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని భరత్‌నగర్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో భూ ఆక్రమణలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. చెల్లెలు అడిగే ప్రశ్నలకు సమాధానాలున్నాయా జగన్ అంటూ ప్రశ్నించారు. సూళ్లూరుపేట కాంగ్రెస్ అభ్యర్థి చందనమూడి శివ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా ముందుకెళ్తామని చింతామోహన్ అన్నారు. వాకాడు అశోక్‌పిల్లర్ వద్ద ఇంటింటా ప్రచారంలో పాల్గొని కరపత్రాలను అందజేశారు. దుగరాజపట్నం ఓడరేవును కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రారంభిస్తామన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విజయశ్రీని మీ ఆడబిడ్డగా ఆదరించండి

ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్





పూలతోటలో ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి పరసా, టీడీపీ అభ్యర్థి విజయశ్రీ - కాంగ్రెస్ నాయకుడు గాది తిలక్‌బాబును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గంగాప్రసాద్, నెలవల తదితరులు

నాయుడుపేట/దొరవారిసత్రం, మే 1: వైద్య సేవలో ఉంటూ పేదలకు మరింత సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ నెలవల విజయశ్రీని ఇంటి ఆడబిడ్డగా భావించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం జువ్వలపాళెం సెంటర్‌లో కాంగ్రెస్‌కు చెందిన గాది తిలక్‌బాబు, మరికొంతమంది టీడీపీలో చేరిక సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పార్టీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. వైసీపీ దౌర్జన్యాలతో ప్రజలందరూ టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత టీడీపీ హాయంలో జరిగిన అభివృద్ధే నేటికి కళ్లకు కనబడుతోందన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయించిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, టీడీపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఎం.శోభారాణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: పరసా

అభివృద్ధి, సంక్షేమం అంటే చంద్రబాబు అని ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. దొరవారిసత్రం మండలం తొగరాముడి, మీజూరు, మినమలమూడి, పూలతోట పంచాయతీల్లో ఇంటింటా ప్రచారంలో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీతోపాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... వైసీపీకి గుణపాఠం చెప్పి విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ప్రజలు వీరి ప్రచారానికి బ్రహ్మ రథం పట్టారు. టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, సుధాకర్‌యాదవ్, బాబు నాయుడు, ప్రసాద్‌నాయుడు, శ్రీహరిరెడ్డి, వి. శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రకటించిన మేనిఫెస్టోను చూపుతున్న విజయశ్రీ

ఎన్డీఏతోనే సామాజిక న్యాయం: వరప్రసాద్





వరప్రసాదరావును శాలువాతో సత్కరిస్తున్న కూటమి నాయకులు - తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), వెంకటగిరి, గూడూరు, మే 1: ఎన్డీఏతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి అన్నారు. తిరుపతి బృందావనం అపార్ట్‌మెంట్‌లో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ తన భర్త ఎంపీగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవారని, తిరుపతి అభివృద్ధి ఆయనతోనే జరిగిందన్నారు.

కూటమి మేనిఫెస్టో పేదల కోసమే...

టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టో పేదలను ఆదుకునే విధంగా ఉందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమై మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, రూ.4వేల పింఛన్ అందిస్తారని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా వరప్రసాదరావును కూటమి సత్కరించారు.

ఎన్డీఏ నాయకులతో సమావేశం ...

గూడూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎన్డీఏ కూటమి నాయకులతో వెలగపల్లి వరప్రసాదరావు సమావేశమయ్యారు. ప్రచార తీరును సమీక్షించారు. చిల్లకూరు మండల జడ్పీటీసీ సభ్యుడు మన్నెం శ్రీనివాసులు, వరగలి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, తిప్పనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వంకా రమణయ్య, శివ, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన: కురుగొండ్ల రామకృష్ణ





కురుగొండ్ల తరపున ప్రచారం చేస్తున్న టీడీపీ జాతీయ కార్యదర్శి పనబాక లక్ష్మి - ప్రచారానికి వచ్చిన కురుగొండ్ల రామకృష్ణకు మహిళల హారతి

వెంకటగిరి, డక్కిలి, మే 1: ఆంధ్రరాష్ట్ర ప్రజలకు రాక్షసపాలన నుంచి విముక్తి కలగాలంటే రామరాజ్య స్థాపనతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణ పరిధిలోని 1 నుంచి 8వ వార్డు వరకు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమను ఉద్ధరిస్తాడని నమ్మి జగన్‌ను గద్దెనెక్కిస్తే ఐదేళ్లపాటు ప్రజలను దోచుకున్నది దాచి పెట్టుకోవడంతోనే సరిపెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలను నిలువు దోపిడీ చేయడమే కాకుండా ఉన్న వనరులను తరలించి సొమ్ము చేసుకున్నాడ.ఇ విమర్శించారు. తనను రెండు సారు స్థానికుడిగా ఆదరించిన వెంకటగిరి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఆదరిస్తే ప్రతి ఇంటి పెద్ద బిడ్డగా కష్టాల్లో పాలుపంచుకుంటానన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మినహా వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగింది శూన్యమన్నారు. ఎప్పుడు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఏ సమయంలోనైనా తన ఇంటి తలుపు తడితే అందుబాటులోకి వచ్చి ఆదుకొంటానన్నారు. తనను కలవాలంటే సిఫారస్సులు అవసరం లేదన్నారు. కరోనా సమయంలో వెంకటగిరిలోనే ఉండి ప్రజలకు సేవలందించినట్లు గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు అనే అస్త్రంతో జగన్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కురుగొండ్ల రామకృష్ణ ప్రచారం ఆయా వార్డుల్లో అమ్మవారి కొలుపులను తలపించింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు, యువత పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి వార్డులో స్థానిక నాయకులు ప్రచారానికి వచ్చారు. అలాగే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను గజమాలతో సత్కరించి మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్‌నాయుడు, కురుగొండ్ల శేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీరామదాసు గంగాధర్, ఏ.కాంతారావు, సంజీవి, వెంకటరత్నం, పోలయ్య, 4వ వార్డు కౌన్సిలర్ పొట్టేళ్ళ ప్రభావతి, మాజీ కౌన్సిలర్ అవుల ప్రహ్లాద, బాలసుబ్రమణ్యం, మునివెంకటరత్నం, పులికొల్లు రాజేశ్వర రావు, బీ.రాజేశ్వరావు, ఏ.సత్యనారాయణ, టి.చెంద్రారెడ్డి, చెలికం మధుసూదన రెడ్డి, కె.శ్రీనివాసులునాయుడు, మాజీ కౌన్సిలర్ ఎం.చెంగారావు, మల్లారం బాబు, సుధా, జి.గోపినాయుడు, జనసేన పార్టీ నాయకుడు జి.వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.





కురుగొండ్లకు గజమాల సత్కారం - చిన్నారితో ఎన్నికల ప్రచారంలో రామకృష్ణ

మహిళా శ్రేయస్సు చంద్రబాబుతోనే సాధ్యం

గూడూరు, మే 1: మహిళల శ్రేయస్సు కోసం అధికారంలోకి మళ్లీ చంద్రబాబు రావాలని తెలుగు మహిళ తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఎం.శ్రావణి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు పెరిగి రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు పెద్దపీట వేసేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తారన్నారు. కరిముల్లా, వెంకటేశ్వర్లురాజు, శ్యామల, శ్రీనివాసులు, భారతి, సుబ్బమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీనుంచి టీడీపీ గూటికి



వెంకటగిరి, మే 1: డక్కిలి మండలం అమ్ముదూరుకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ నేతృత్వంలో వెంకటగిరి పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వి.రాజయ్య, కె.రాజయ్య, వి.సుబ్బయ్య, వి.శివయ్య తమ అనుచరులు సహా 30 కుటుంబాలతో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆర్.రాజా, పి.కోటేశ్వరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు, పాస్టర్లతో ఆత్మీయ సమావేశం



వెంకటగిరి, మే 1: పట్టణంలోని ఆర్ఎంపీలు, పాస్టర్లతో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ వెంకటగిరి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కురగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ వేర్వేరుగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉమ్మ మేనిఫెస్టోపై అవగాహన కల్పించడంతోపాటు వైసీపీ ప్రభుత్వం చేసిన అరచకాలు, ఆక్రమాలను వివరించారు. మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను, తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీలు ఆమెను సత్కరించారు.

ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించండి

గూడూరు అర్బన్, మే 1: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు ఏ.బాలకృష్ణమనాయుడు కోరారు. మంగళవారం సనత్‌నగర్, నరసయ్యగుంటల్లో తమ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని గద్దెదించి అభివృద్ధిని కాంక్షించే ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసప్ప, దయాకర్, బిందురెడ్డి, సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు

గూడూరు, మే 1: పట్టణంలో మంగళవారం మేడే వేడుకలను వివిధ కార్మికసంఘాలు ఘనంగా నిర్వహించాయి. కూరగాయల మార్కెట్ సమీపంలో సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో మే డే వేడుకలను నిర్వహించారు. భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కోటేశ్వరరావు, మెహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కాళహస్తి శేషయ్య స్మారక భవనం, ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... 139 సంవత్సరాల క్రితం సాధించుకున్న 8 గంటల పని దినాన్ని సమా ఇతర హక్కులను కార్మికులు పోరాడి సాధించుకున్నారన్నారు. నేడు తిరిగి 12గంటల పని దినం అమలవుతోందని, పోరాడి సాధించుకున్న నలభై నాలుగు రకాల కార్మిక చట్టాలను మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. విదేశీ పెట్టుబడికి, విదేశీ కంపెనీలకు మన కార్మికులను కట్టు బానిసలుగా మార్చిందన్నారు. అనంతరం ఎర్రజెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయక కార్యదర్శి వి.వి. రమణయ్య, చిన ఓబయ్య, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యులు కె.అజిత, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా... అందుకే ఓట్లడగడానికి వచ్చా: పాశం





కొత్తపట్నంలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ - దైవాలదిబ్బలో పాశం సునీల్‌కుమార్‌కు దిష్టి తీస్తున్న స్థానికులు

కోట, మే 1: తన హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశానని ఓటు అడిగే హక్కు తనకే ఉందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని గున్నంపడియ, యమదిన్నెపాళెం, శ్రీనివాససత్రం, కొత్తపట్నం, వావిళ్లదొరువు, గోవిందపల్లి, గోవిందపల్లెపాళెం, అల్లపాడు, చీకర్లదిబ్బ, దైవాలదిబ్బల్లో సుడిగాలి పర్యటన చేసి సూపర్-6 కరపత్రాలను పంపిణీ చేశారు. తాను ఎమ్మెల్యేగా హయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని కల్లబొల్లి మాటలు నమ్మకుండా సైకిల్‌గుర్తుకు ఎమ్మెల్యేగా తనను, కమలం గుర్తుకు ఓటు వేసి ఎంపీగా వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. స్థానికేతురులు నియోజకవర్గంలోకి ప్రవేశించి కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు అడుగుతున్నారని వారి మాటలను నమ్మవద్దన్నారు. ఎన్డీఏ కూటమితో చంద్రబాబు ఆంధ్రాకు సీఎం కావడం తథ్యమన్నారు. ఆయా గ్రామాలలో మహిళలు పాశింకు, నాయకులకు గుమ్మడికాయ దిష్టి తీశారు. ఆయన వెంట చిల్లకూరు దశరథరామిరెడ్డి, పి.కోటేశ్వరరెడ్డి, ఎన్.జగన్మోహన్‌రెడ్డి, శివకోటారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, ఆనంద్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్, గోపాల్‌నాయుడు, మధురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు, రమేష్ విజయభాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కోటేశ్వరప్రసాద్, వెంకటేశ్వర్లు, పనబాక కోటేశ్వర రావు, అక్కమ్మ, శశి, సుధాకర్, జానా వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యం

చిల్లకూరు: మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందించి వారి సాధికారతకు కృషి చేసింది టీడీపీయే అని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం తానంకి నానాజీ ఆధ్వర్యంలో స్థానిక మిక్సిడ్‌కాలనీలో సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చంద్రబాబు సీఎం అయిన తరువాత పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. అలాగే మహిళల సంక్షేమం కోసం మహాశక్తి పథకాన్ని అమలు పాటుపడ్డారన్నారు. రాష్ట్రంలో విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీని గద్దెదించాలన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి కూటమి అభ్యర్థులైన పాశం సునీల్‌కుమార్, వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, నరసారెడ్డి, దినేష్, రామ్మూర్తి, సురేష్‌బాబు, మధు, దాసరి రాము, నవీన్‌కుమార్‌యాదవ్,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరులో ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి, టీడీపీ నేతలు